
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
ఆదివారం 28 సెప్టెంబరు 2025 | 7



కారు ఢీకొని భవానీ భక్తుడి మృతి 8
భార్య పుట్టింటి నుంచి రాలేదని భర్త ఆత్మహత్య 8
భక్తుల ముసుగులో దొంగతనాలు 8

శక్తి పీఠం..పిఠాపురం



పుర్హుతికాఅమ్మవారు



రాజరాజేశ్వరీదేవి

అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం.. అధిష్ఠాన దేవతైన పుర్హుతికాదేవి కొలువై ఉన్న పిఠాపురం పాదగయ క్షేత్రం.. దక్షిణకాశీగా, శక్తిపీఠంగా విరాజిల్లుతోంది. స్వయం భూగా వెలసిన కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి,ఆదిశంకరాచార్య స్వామి ప్రతిష్ఠింపబడిన రాజరాజేశ్వరీదేవి ఇక్కడే కొలువై ఉన్నారు. శక్తిపీఠం కావడంతో ఇక్కడ పుర్హుతికా అమ్మవారిని దర్శించుకుని కుంకుమపూజలు, చండీయాగం చేయించుకునేందుకు ఉభయ తెలుగురాష్ట్రాలతో పాటు కర్నాటక, మహారాష్ట్ర ఒరిస్సా,ఢిల్లీ, గోవా, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలు నుంచి భక్తులు వస్తారు. పరాశక్తి ఆజ్ఞ మేరకు మహావిష్ణువు సతీ మృతదేహాన్ని తన సుదర్శనచక్రంతో ఖండించాడు. సతీ దేహభాగా లు భూమిపై పడి 108 శక్తి పీఠాలుగా విరాజిల్లుతున్నాయి. అందులో 101 విశేషంగా, 52 పీఠాలు ముఖ్యమైనవిగా, అతి ముఖ్యమైన 18 భాగాలు పడిన చోట అష్టాదశ శక్తి పీఠాలుగా విరాజిల్లుతున్నాయి. అష్టాదశ శక్తి పీఠాల్లో ముఖ్యమైన పీఠభాగం(పిరుదులు) పడిన చోటే పిఠాపురంగా విరాజిల్లుతోంది. పాదగయ క్షేత్రంలోని పుర్హుతికా అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదిక్షణ చేస్తుంటే అష్టాదశ శక్తి పీఠాల నమూనా విగ్రహాలు కనిపిస్తాయి.

- (ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

కొండల్లో తలుపులమ్మ

ఆదివారం ప్రత్యేకం

మహిమ గల అమ్మవారు తలుపులమ్మ తల్లి.. కాకినాడ జిల్లా లోవ గ్రామంలో వెలసింది. తూర్పు కనుమల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో ధారకొండ, తీగ కొండల మధ్య ఒక గుహలో స్వయంభుగా వెలిసినట్లు ఆలయ పండితులు చెబుతుంటారు. క్షేత్రానికి తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు వస్తుంటారు. కొత్త వాహనాలు కొనుగోలు చేసినప్పుడు ఈ క్షేత్రంలో పూజలు చేస్తే ప్రమాదాల బారిన పడకుండా ఉంటాయని భక్తుల నమ్మకం.ఈ నేపథ్యంలో నిత్యం కొత్త వాహనాలు, భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడుతూ ఉంటుంది. ఏటా రూ.20 కోట్ల ఆదాయంతో రాష్ట్రంలో ప్రముఖ ఆలయాలతో పోటీ పడుతున్న ఈ దేవస్థానం ప్రసిద్ధి దేవాలయాల్లో ఒకటిగా విరాజిల్లుతుంది.



పెరుగుతున్న భక్తుల రద్దీ నేపథ్యంలో రూ.20 కోట్లు ఖర్చు చేసి ఆలయ పునః నిర్మాణ పనులు చేపడుతున్నారు.ఏటా ఆషాఢమాసంలో నెల రోజులు ఆలయంలో అమ్మవారికి ఉత్సవాలు నిర్వహిస్తారు.

- (తుని రూరల్-ఆంధ్రజ్యోతి)

జై భవానీ!

దసరా వచ్చిందంటే అమ్మవార్ల ఆలయాలు ప్రత్యేకం.. భక్తులతో కిటకిటలాడుతూనే ఉంటాయి.. మన జిల్లాలోనూ ప్రముఖ ఆలయాలు ఉన్నాయి.. వాటి చరిత్రను ఒకసారి తెలుసుకుందాం.. వీలైతే ఒకసారి చూసొద్దాం..!





భక్తుల పాలిట విజయదుర్గ

భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా వెదురుపాక విజయదుర్గా అమ్మవారు విరాజిల్లుతుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠంలో గత 54 ఏళ్లుగా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 1972లో పీఠాధిపతి గాడ్ విజయదుర్గా పీఠాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వెదురుపాక విజయదుర్గా పీఠంలో దేవి శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. 1989లో ప్రస్తుత శృంగేరి పీఠాధిపతి భారతీయతీర్థ చేతులమీదుగా శంకుస్థాపన చేసి పీఠాన్ని నిర్మించారు. అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి నిత్య ఆరాధనలు చేస్తున్నారు.దసరా 10 రోజుల పాటు అమ్మవారిని దర్శించుకున్న భక్తులు స్వయంగా శ్రీచక్ర అర్చనలు చేసుకుని అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకుంటారు. గత 54 సంవత్సరాలుగా పీఠంలో ఉచిత నిత్య అన్నదానం జరుగుతుంది.


- (రాయవరం -ఆంధ్రజ్యోతి)

ఏటా..భవానీ మాల



భవానీ మాల చాలా మందికి ఆనవాయితీ.. ప్రతి ఏటా వేస్తారు. దుర్గమ్మ అంటే నమ్మకం. అమలాపురం వెత్సావారి అగ్రహారానికి చెందిన అర్లపల్లి ముత్యం ఇప్పటికే పలు పర్యాయాలు భవానీ మాల ధరించి గురుభవానీగా మారారు. ఇప్పటి వరకు సుమారు 15 వేల మందికి భవానీ దీక్ష ఇచ్చారు. అమలాపురం రూరల్ మండలం నల్లమిల్లిలో శ్రీమురళీకృష్ణస్వామి ఆలయంలో శ్రీదుర్గా వీరభద్ర భవానీ పీఠం నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఐదు పర్యాయాలు భవానీ మాలధారులతో కలిసి కాలినడకన విజయవాడ కనకదుర్గమ్మను దర్శనం చేసుకున్నారు. విజయవాడకు చెందిన రాచకొండ కామేశ్వరశర్మ తొలిసారిగా భవానీ దీక్షను కోనసీమకు పరిచయం చేశారు. ఆయన వద్దే దీక్ష తీసుకుని నేటికీ కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది పీఠం వద్ద దసరాకు 108 మంది భవానీ మాల ధరించారు. ఇక కార్తీక మాసంలో మండల దీక్షకు ఏటా 300 మందికి పైబడి భవానీ మాల ధరిస్తున్నారు. - (అమలాపురం రూరల్ - ఆంధ్రజ్యోతి)

నాటి లాంతర్ల సెంటరే..దేవీచౌక్!



బ్రిటీష్ హయాంలో మూడు లాంతర్ల సెంటరే.. రాజమహేంద్రవరం దేవిచౌక్.1933లో బత్తుల మల్లికార్జునరావు సోదరులు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో దేవిచౌక్‌గా మారింది. బ్రిటీష్ హయాంలో నాలుగు రోడ్ల కూడలిలో మునిసిపాలిటీ వారు వీధిదీపాలుగా లాంతర్లను ఏర్పాటు చేసేవారు.ఇలా మూడు లాంతర్లను దేవిచౌక్‌లో సాయంత్రం 5:30 గంటలకే వెలిగించి వెళ్లేవారు.అప్పటి నుంచి మూడు లాంతర్ల కూడలిగా దేవిచౌక్‌ను పిలిచేవారు.శ్రీబాలాత్రిపుర సుందరిదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించాక మూడు లాంతర్ల సెంటర్ దేవిచౌక్‌గా రూపాంతరం చెందింది. నాలుగు స్తంభాలను నిర్మించి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అలా ఆలయ ప్రస్థానం ప్రారంభమైంది. ఇక్కడ నవరాత్రులు 1933లో మొదలు పెట్టారు. ఈ ఏడాది 92వ దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తారు.

- (రాజమహేంద్రవరం సిటీ - ఆంధ్రజ్యోతి)



పెద్దాపురం పెద్దమ్మ మరిడమ్మ

17వ శతాబ్దం నుంచి పెద్దాపురం పెద్దమ్మగా మరిడమ్మ ఆలయం పేరెన్నికగన్నది. పసుపు పూసిన కర్ర గద్దెను అమ్మవారి ప్రతిరూపంగా పూజిస్తారు. మరిడమ్మ జాతర ప్రతీ ఏడాది జ్యేష్ఠమాసంలో అమావాస్య నుంచి ప్రారంభమై ఆషాఢ మాసంలో అమావాస్య వరకూ 37 రోజుల పాటు జరుగుతాయి. పెద్దాపురం మానోజీ చెరువు సమీపంలో గ్రామదే వత గా మరిడమ్మ వెలిశారని స్థానికులు చెబుతారు. అడవిలో పశువులు కాపరులకు 16 ఏళ్ల యువతి కనిపించి నేను చింతపల్లివారి ఆడబ డుచునని చెప్పి మాయమైనట్టు పురాణాలు చెబుతున్నాయి. మానోజీ చెరువు సమీపంలో ఆలయం నిర్మించాలని ఆజ్ఞాపించడంతో అక్కడే తాటాకుపాక వేసి నాడు ఆలయ నిర్మాణం చేపట్టారు. నాటి నుంచి నేటి వరకూ ధూపదీప నైవేద్యాలను అమ్మవారు అందుకుంటున్నారు.ప్రధాని మోదీ మన్ కీ బాత్ రేడియో కార్యక్రమం ద్వారా పెద్దాపురంలో ఉన్న మరిడమ్మ ఆలయం గురించి ప్రస్తావించారు.

- (పెద్దాపురం -ఆంధ్రజ్యోతి)

పశువుల బీమాపై డీఆర్‌డీఏ పీడీ సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న పీడీ శ్రీనివాసరావు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పాడి రైతు కొనుగోలు చేసే ప్రతి పశువుకు బీమా కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ జి.శ్రీనివాసరావు సూచించారు. పశుసంవర్ధకశాఖ, డీఆర్‌డీఏ శాఖల అధికారులతో శనివారం ఆయన డీఆర్‌డీఏ కార్యాలయ సమావేశ మందిరంలో కన్వర్జన్సీ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలకు స్త్రీనిధి ద్వారా పాడి పశువుల కొనుగోలు, వాటి ధర, కొనుగోలుకు చుట్టుపక్కల జిల్లాల్లో ఉండే పశువుల జంట్ల గురించి చర్చించారు. మండల పశువైద్యాధికారులను మండల ఏపీఎంలతో మమేకమై కొనుగోలు చేసిన పశువులకు బీమా కల్పించాలని, స్వయం సహాయక సంఘాల మహిళలకు పశు బీమాపై అవగాహన కల్పించాలని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ కె.కృష్ణమూర్తి మండల పశువైద్యాధికారులను ఆదేశించారు. మహిళా సమాఖ్యలకు స్వయం ఉపాధి కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అమలు చేసేందుకు పశుసంవర్ధకశాఖ, డీఆర్‌డీఏ శాఖల ఆధ్వర్యంలో ఈ సమీక్ష నిర్వహించినట్లు జేడీ తెలిపారు. సమావేశంలో జిల్లావ్యాప్తంగా ఉన్న పశువైద్యాధికారులు ఏపీఎంలు పాల్గొన్నారు.

జిల్లాలో హౌసింగ్ కాలనీలు తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలి

» జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో హౌసింగ్ కాలనీలను తనిఖీలు చేసి నివేదికలను సమర్పించా లని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు అధికారులను ఆదే శించారు. కాకినాడ కలెక్టరేట్‌లో శనివారం డ్వామా పీడీ వెంకట లక్ష్మితో కలిసి ఆయన హౌసింగ్ కాలనీల తనిఖీల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు మాట్లాడుతూ గతంలో ఏర్పాటు చేసిన హౌసింగ్ కాలనీలకు సంబంధించి 300 వర్క్ ఐడీలకు గాను ఇప్పటివరకు 189వర్క్ ఐడీలు మాత్రమే నివేదికలను ఇచ్చామన్నారు. అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టి మిగిలిన 111 వర్క్ ఐడీలను అక్టోబరు 7వతేదీకి తనిఖీ చేసి నివేదికలను సమర్పించాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ పంచాయతీరాజ్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖల సమన్వయంతో పనిచేసి హౌసింగ్ కాలనీల తనిఖీ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఈ పనులకు సంబంధించి జిల్లాలో వర్క్ ఐడీలు ఇవ్వాలన్నారు. దీనిపై 17 మండలాలకు 12 ప్రత్యేక బృందాలను నియమించామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సకాలంలో తనిఖీలు పూర్తిచేయాలని కోరారు. పంచాయతీరాజ్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

అసోంకు బియ్యం ఎగుమతులు

» మొట్టమొదటిసారిగా సామర్లకోట నుంచి పచ్చిబియ్యం రవాణా.. రైల్వేకు రూ.20లక్షల ఆదాయం

సామర్లకోట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సామర్లకోట రైల్వే గూడ్స్ యార్డు నుంచి 896 మెట్రిక్‌టన్నుల పరిమాణం గల పచ్చిబియ్యం ఎగుమతులను శనివారం ప్రత్యేక గూడ్స్‌రైలు ద్వారా ఎగుమతులు చేశారు. సామర్లకోట ఏడీబీ రోడ్డులోని రెండు ప్రముఖ రైస్ మిల్లులకు చెందిన ఈ బియ్యం ఎగుమతులకోసం 14 వ్యాగన్లు వినియోగించారు. సామర్లకోట రైల్వేగూడ్స్‌యార్డు నుంచి మొట్టమొదటిసారిగా అసోంకు ఎగుమతులు చేస్తున్న పచ్చిబియ్యం రవాణా ద్వారా సామర్లకోట రైల్వేస్టేషన్‌కు రవాణా చార్జీలుగా రూ.20లక్షల ఆదాయం సమకూరడమేగాక 50 లారీలకు ఎగుమతులు, దిగుమతుల ద్వారా రూ.4లక్షలు, 50మంది హమాలీ కూలీలకు రూ.2లక్షల మేర ఉపాధి లభించింది. రానున్న నెలరోజుల కాలంలో మరో 10వేల మెట్రిక్ టన్నుల మేర పచ్చిబియ్యం అస్సాం రాష్ట్రానికి ఎగుమతులు సామర్లకోట నుంచే రవాణా చేసేందుకు రైల్వే ఉన్నతాధికారులతో అంగీకారం కుదిరినట్లు తెలిసింది.



సామర్లకోట రైల్వేగూడ్స్ యార్డులో ఎగుమతులు చేస్తున్న బియ్యం

ఏఐలో మంచిని స్వీకరించాలి

» కాకినాడ ఎంపీ ఉదయశ్రీనివాస్

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాంకేతిపరంగా వస్తున్న మార్పులను అవగాహన చేసుకుంటూ ముందడుగు వేయాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ సూచించారు. ఏఐలో మంచి,చెడులు ఉన్నాయని, అందులో మంచిని స్వీకరిస్తే జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగవచ్చునని తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడురోజులపాటు నిర్వహించిన సాంకేతి విద్యాఉత్సవాలు(టెక్‌హ్యాకథాన్) శనివారం సాయంత్రంతో ముగిశాయి. ఇందులో విద్యార్థులు ప్రదర్శించిన పేపర్, పోస్టర్ ప్రజంటేషన్, ప్రాజెక్టు ఎక్స్‌పోలను పరిశీలించారు. అనంతరం విజేతలకు నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ తుమ్మలబాబు, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఆదర్శ్ కళాశాల చైర్మన్ బుర్రా అనుబాబు, సెక్రటరీ అనురాధ, డైరెక్టర్ అఖిలేష్, డిప్లొమా ప్రిన్సిపాల్ వైవీఎన్ రాజశేఖర్, డీన్ కొండలరావు పాల్గొన్నారు.

గోదావరిలో ఇద్దరి గల్లంతు

» రాజమహేంద్రవరం పుష్కర్‌ఘాట్ వద్ద ఘటన

రాజమహేంద్రవరం,సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గోదావరిలో ఇద్దరు భవానీ మాలధారులు గల్లంతయ్యారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం పెంటపల్లికి చెందిన గుబ్బల బాపిరాజు(28) రాజమహేంద్రవరంలోని ఓ అపార్టుమెంటులో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. రాజానగరం మండలం శ్రీరాంపురానికి చెందిన బావమరిది(భార్యఅన్న) రాయుడు వీరబాబు(21) హైదరాబాద్‌లోని ఓ గోల్డ్‌షాపులో పనిచేస్తున్నాడు. దసరా కావడంతో ఇద్దరూ భవానీ మాలవేసుకున్నారు. పుష్కరఘాట్‌కి శనివారం గోదావరి స్నానానికి దిగారు. వరద ఎక్కువగా ఉండడంతో వీరబాబు కొట్టుకుపోతుండడంతో బాపిరాజు తన మెడలో ఎర్రకండువా అందించబోయి జారిపోయాడు. దీంతో ఇద్దరూ గల్లంతయ్యారు.

శ్రీలంక జలాల్లో పట్టుబడిన మత్స్యకారుల విడుదలకు కూటమి ప్రభుత్వం కృషి

» శాసనసభలో ఎమ్మెల్యే వనమాడి

కాకినాడసిటీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నావిగేషన్ సిస్టమ్ పనిచేయకపోవడంతో శ్రీలంక జలాల్లోకి వెళ్లి పట్టుబడిన కాకినాడకు చెందిన మత్స్యకారుల విడుదలకు కూటమి ప్రభుత్వం విశేష కృషి చేసిందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కృతజ్ఞతలు తెలిపారు. దీనిపై శనివారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ శ్రీలంక జైలులో 52రోజులపాటు నిర్బంధానికి గురైన నలుగురు మత్స్యకారులు సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారన్నారు. శ్రీలంక కోస్టుగార్డులకు మత్స్యకారులు పట్టుబడిన విషయాన్ని తాను వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లానని, దీనిపై సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడితో, విదేశాంగశాఖ, కోస్టుగార్డ్ అధికారులతో సంప్రదించి మత్స్యకారుల విడుదలకు ఎనలేని కృషి చేశారన్నారు. మత్స్యకారుల విడుదలకు కృషి చేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే వనమాడి అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మత్స్యకారులను నమ్మించి మోసం



చేసిందన్నారు. మత్స్యకారులకు ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయకుండా నిర్లక్ష్య వైఖరితో వ్యవహరించిందన్నారు. రిజర్వాయర్లు, చెరువులపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల జీవనోపాధిని కొల్లగొట్టేందుకు జీవో నెంబర్ 217 తీసుకువచ్చిందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే మత్స్యకారులకు ఇచ్చిన మాట ప్రకారం ఈ జీవోను రద్దు చేసిందన్నారు.చెరువులు, రిజర్వాయర్లు, సముద్రంపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల ఆర్థికతోడ్పాటుకు ప్రభుత్వం సబ్సిడీపై వలలు, మత్స్య సంపదను తెలుసుకోవడానికి వీహెచ్‌పీ, డాట్ సెట్స్, ట్రాన్స్‌పాండర్‌లు అందించిందన్నారు.

వస్తామనుకోలేదు

» 54రోజులపాటు బందీలయ్యాం
» శ్రీలంక నుంచి కాకినాడకు పయనమైన మత్స్యకారులు

8

10న జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశం

» జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): అక్టోబరు 10న జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన వెలువరించారు. వచ్చేనెల 10వ తేదీ మధ్యాహ్నం 2.30గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లో సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. సంబంధితశాఖల అధికారులు విధిగా హాజరుకావాలన్నారు. సమావేశంలో ఆయా శాఖలు అమలు చేస్తున్న వివిధ పథకాలపై సమీక్షిస్తామన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం



- ఏడాదికి రూ.12వేలు ఉపకార వేతనం
- నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు

ఈ నెల 30 వరకు గడువు.. డిసెంబరు 7న రాత పరీక్ష

- ప్రభుత్వ పాఠశాలల 8వ తరగతి విద్యార్థులు అర్హులు

అమలాపురం రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతిభకు ప్రోత్సాహం తోడైతే ఆ విద్యార్థులు విజయ సోపానాన్ని అధిరోహించడం ఖాయం. చదువుకు పేదరికం అడ్డు కారాదు. ప్రతిభావంతులైన విద్యార్థులు చదువు మధ్యలో ఆపేయకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఉపకార వేతనాలు అందిస్తుంది. దీనిలో భాగంగా ఏటా నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష నిర్వహిస్తుంది. ఈ పరీక్ష రాసేందుకు ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులు అర్హులు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో అర్హత సాధించిన ప్రతిభా వంతులైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏటా ప్రతీ విద్యార్థికి రూ.12వేలు చొప్పున ఉపకార వేతనాలు కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30 వరకు మాత్రమే గడువు ఉంది. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు డిసెంబరు 7న అర్హత పరీక్ష నిర్వహిస్తారు.

180 మార్కులతో ప్రశ్నాపత్రం..

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష 180 మార్కులకు ఉంటుంది. 90 మార్కులకు మెంటల్ ఎబిలిటీ టెస్ట్ ఎంఏటీ ఉంటుంది. మల్టిపుల్ చాయిస్ విధానంలో ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు చొప్పున ఇస్తారు. స్కాలర్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ కింద 90 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. ఫిజిక్స్ నుంచి 12, కెమిస్ట్రీ 11, బయాలజీ 12, గణితం 20, చరిత్ర 10, జాగ్రఫీ 10, పొలిటికల్ సైన్స్ 10, ఎకనామిక్స్ సబ్జెక్టు నుంచి 5 మార్కులు చొప్పున ప్రశ్నలు ఉంటాయి. ఈ ప్రశ్నలు అన్నీ 7వ తరగతి పూర్తి సిలబస్, 8వ తరగతిలో నవంబరు వరకు చెప్పిన సిలబస్‌కు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. జనరల్, బీసీ, పీహెచ్ అభ్యర్థులు 40 శాతం అంటే 36 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 32 శాతం అంటే 29 మార్కులను ఎంఏటీ, ఎస్ఏటీలలో విడివిడిగా పొంది ఉంటేనే ఈ పరీక్షలో క్వాలిఫై అయినట్టు.

పరీక్ష రాసేందుకు అర్హతలు..

విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50లక్షల లోపు ఉండాలి. ఓసీ, బీసీ విద్యార్థులు 7వ తరగతిలో 55శాతం మార్కులతోను, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 50శాతం మార్కులు పొంది ఉండాలి. ఇక 2025-26 సంవత్సరంలో ప్రభుత్వ జిల్లా పరిషత్, మున్సిపల్, ప్రభుత్వ, ఎయిడెడ్, వసతి సౌకర్యం లేని మోడల్ స్కూల్స్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు.

సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు



జిల్లాలో ప్రతిభావంతులైన విద్యార్థులు అందరూ ఈ పరీక్ష రాసేందుకు చర్యలు తీసుకున్నాం. నెలాఖరు వరకు దరఖాస్తులకు గడువు ఉన్నందున మరింత మంది విద్యార్థులు పరీక్ష రాసే విధంగా పాఠశాలల వారీగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు సంబంధించి కొందరు ఉపాధ్యాయులు విద్యార్థులకు ముందస్తు శిక్షణ ఇస్తున్నారు. ఈ ఏడాది జిల్లా నుంచి ఎక్కువ మంది పేద విద్యార్థులు ఉపకార వేతనాలు పొందే విధంగా పాఠశాలల్లోనే తర్ఫీదు పొందుతున్నారు. పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

బీర హనుమంతరావు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్, కోనసీమ జిల్లా

ప్రత్యేక తరగతులు



కేంద్ర ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలు జిల్లా నుంచి ఎక్కువ మంది పొందేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఏడాదికి రూ.12 వేలు చొప్పున పొందే ఉపకార వేతనం ఉన్నత విద్యకు ఆలంబనగా నిలుస్తుంది. ఎన్‌ఎంఎంఎస్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా ఎవరికీ భారం కాకుండా ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలి.

డాక్టర్ షేక్ సలీంబాషా, కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 863 ప్రభుత్వ పాఠశాలల్లోని 8వ తరగతి విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో 2817 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. కోనసీమ జిల్లాలో 289 పాఠశాలల్లో 11551 మంది 8వ తరగతి విద్యార్థులు ఉన్నారు. వారిలో ఇప్పటి వరకు 963 మంది దరఖాస్తు చేసుకున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో 252 పాఠశాలల్లో 12,167 మంది విద్యార్థులకుగాను 846 మంది, కాకినాడ జిల్లాలో 322 పాఠశాలల్లో 17,004 మంది విద్యార్థులకుగాను 1008 మంది దరఖాస్తు చేసుకున్నారు.

భద్రతా ఏర్పాట్లు కఠినంగా ఉండాలి

'పీపీ' పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పరిశీలించిన ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



పరీక్షా కేంద్రాల్లో పటిష్ట నిఘాను పరిశీలిస్తున్న ఐజీ అశోక్‌కుమార్, అధికారులు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఏపీఎస్ఎల్‌పీఆర్‌బీ) వచ్చే నెల 5న కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించనున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల రాత పరీక్ష నేపథ్యంలో పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ శనివారం పరిశీలించారు. పరీక్ష సమయంలో భద్రతా ఏర్పాట్లు కఠినంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాల వ్యవస్థను సమగ్రంగా అమలు చేయాలన్నారు. ఇన్విజిలేటర్లు పూర్తిగా శిక్షణ పొందినవారై ఉండాలన్నారు. పరీక్షా సమయం ముందు, తరువాత యూనివర్శిటీ ప్రాంగణంలో అనుమతి లేని వ్యక్తులు ప్రవేశించకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆరంభ సమయానికి ముందే అభ్యర్థులు క్రమబద్ధంగా ప్రవేశించే విధంగా గేట్ మేనేజ్‌మెంట్ చేయాలన్నారు. కాపీయింగ్ లేదా మాల్ ప్రాక్టీస్ జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ. సుబ్బారావు పేర్కొన్నారు. అనంతరం ఈసీఈ విభాగంలో ఉన్న పరీక్షా గదులను ఐజీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఐజీ వెంట కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్, కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి పాటిల్ దేవరాజ్ మనీష్, జేఎన్‌టీయూకే వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కె ప్రసాద్, ఎస్‌బీ డీఎస్పీ కెవి.సత్యనారాయణ ఉన్నారు.

ఐశ్వర్యాంబిక అనుగ్రహించు...

శ్రీపీఠంలో ఆరో రోజుకు మహాశక్తి యాగం



అమ్మవారికి హారతి ఇస్తున్న స్వామి పరిపూర్ణా నంద సరస్వతి

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రమణయ్యపేట శ్రీపీఠం గోశాల ప్రాంగణంలో వేలాది మంది మహిళా మూర్తుల ఆధ్వర్యంలో 3వ మహాశక్తి యాగం-2025 వైభవంగా సాగుతోంది. అమ్మా ఐశ్వర్యాంబిక.. లలిత సహస్రనామంతో చుట్టుపక్కల పరిసర ప్రాంతాలన్నీ మార్మోగుతున్నాయి. భక్తులను ఉద్దేశించి స్వామి పరిపూర్ణా నంద సరస్వతి మాట్లాడుతూ వెయ్యి కోట్ల లలిత సహస్రనామ కుంకుమార్చనతో చేపట్టిన ఈ మహాక్రతువులో భాగస్వామ్యమైన వారంతా ధన్యులేనన్నారు. మహా తపస్సులో వాక్కు, మనసు ముఖ్యమని, చేత్తో కుంకుమ పారాయణం చేస్తూ మీ శరీరాన్ని అమ్మవారికి అర్పించడం ముఖ్యమన్నారు. లలిత సహస్రనామానికి అనేక శక్తులు ఉన్నాయని, నత్తి ఉన్న వాళ్లు సైతం ఈ నామాన్ని 11 రోజుల్లో నేర్చుకుంటే స్పష్టం గా పలకగల మహాత్యం ఉంద న్నారు. శనివారం ఉదయం శ్రీపీఠంలో వేంచేసిన ఐశ్వర్యాంబిక అమ్మవారు శ్రీరాజరాజేశ్వరిదేవీగా దర్శనమిచ్చారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ మంగళచండీ, రాజరాజేశ్వరి హోమాలు నిర్వహించారు. మహాశక్తి యాగం నిర్వహణ కోసం భాగస్వాములుగా ఉన్న పలువురు దాతలకు మహాశక్తి యంత్ర ప్రసాదాన్ని స్వామీజీ అందజేశారు. 18 దివ్య క్షేత్రాల గర్భాలయ అంత ర్భాగమైన శిలల నుంచి సేకరించిన వాటితో మహాశక్తి యంత్రాలను తయారు చేయించామన్నారు. ప్రత్యక్షంగా పాల్గొనలేని వాళ్లు శ్రీపీఠం యూట్యూబ్ ఛానల్లో యాగం కార్యక్రమం లైవ్‌లో తిలకించాలని కోరారు. పూజల్లో సుమారు 35వేల మంది భక్తులు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

వాడపల్లికి పోటెత్తిన భక్తజనం

వెంకన్నకు ప్రత్యేక పూజలు

రూ.52.33 లక్షల ఆదాయం



శ్రీ వేంకటేశ్వరస్వామికి అలంకరణ

ఆత్రేయపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకుమజామునే స్వామికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్రోక్తంగా నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులు తీరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా రూ.52.33 లక్షల ఆదాయం లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. వాడపల్లి బస్టాండ్‌లో వేలాది మంది మహిళా భక్తులు ఉచిత బస్సు కోసం వేచిఉండి రాక పోకలు సాగించారు. ఆలయంలో, బస్టాండ్లలోను ఎక్కువగా మహిళలే కనిపించారు.



వాడపల్లి వెంకన్న ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహిస్తున్న భక్తులు


నిత్యాన్నదాన పథకానికి రూ.1.70 లక్షల విరాళం



పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శనివారం కోరుకొండ మండలం గాదరాడకు చెందిన బాదం చక్రవర్తి, సీతామహలక్ష్మి రూ.1.70 లక్షల విరాళం ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. ఆయన అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు. రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు, భక్తులు ఉన్నారు.

గాయత్రి అలంకరణలో రత్నగిరి దుర్గలు



అన్నవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా రత్నగిరిపై ఉన్న వనదుర్గ, తొలిపావంచా వద్ద కొలువైఉన్న కనకదుర్గలు గాయత్రి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

లలితాదేవిగా తలుపులమ్మ

తుని రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తలుపులమ్మ లోవ దేవస్థానంలో శనివారం శ్రీ లలితా దేవిగా దర్శనమిచ్చారు.పెద్దఎత్తున భక్తులు దర్శించుకున్నారు.



వస్తామనుకోలేదు..

- 54 రోజుల పాటు బందీలయ్యాం
- సీఎం చంద్రబాబు, ఎంపీ సానా సతీష్, కూటమి ప్రభుత్వ సహకారంతో బతికి బయటపడ్డాం
- శ్రీలంక నుంచి కాకినాడకు పయనమైన మత్స్యకారులు



మత్స్యకారుల పడవతో కోస్ట్ గార్డ్ సిబ్బంది



మత్స్యకారులు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

'వస్తామని ఊహించలేదు... జైల్లోనే మగ్గిపోతామనుకున్నాం.. అక్కడ జైలులో ఉన్న తమిళనాడు ఖైదీలను చూసి భయమేసింది. ఒక్కో జైలులో పాపం ఐదు వేల మంది ఉన్నారు. అందరూ కూడా మాలానే బోటు అదుపు తప్పి.. శ్రీలంక సముద్ర జలాల్లో దారి తప్పిన వారే. వారిలానే తాము కూడా ఉండాల్సి వస్తుందేమోననే భయం వెంటాడింది. కానీ ఇండియన్ ఎంబసీతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు ఇతరుల సహకారంతో మేము బతికి బయటపడ్డాం.. కాకినాడ చేరుకోగలుగుతున్నాం" ఇదీ శ్రీలంక జైలు నుంచి విముక్తులైన మత్స్యకారుల మనోగతమి ది. శ్రీలంక సముద్రజలాల్లో చిక్కుకుని జాఫ్నా జైలులో సుమారు 54రోజుల పాటు నిర్బంధంలో ఉన్న కాకినాడకు చెందిన మత్స్యకారులు ఎట్టకేలకు కాకినాడ బయల్దేరారు. ఈ సందర్భంగా వారు ఫోన్‌లో 'ఆంధ్రజ్యోతి'కి పలు విషయాలు వెల్లడించారు.

అసలేం జరిగిందంటే..

కాకినాడ జగన్నాథపురానికి చెందిన మత్స్యకారులమైన మేము కె.శ్రీను వెంకటేశ్వర్, కర్రి నూకరాజు బుర్రయ్య, చందా నాగేశ్వరరావు, పంతాడి బ్రహ్మానందం గత నెల ఆగస్టు 3న నాగపట్నం వెళ్లి ఓ పడవ కొనుగోలు చేశారు. "తిరుగు ప్రయాణంలో చీకటైపోయింది. గాఢాంధకారం.. చుట్టూ చీకటి.. నడిసంద్రంలో దారి తప్పిపోయాం. శ్రీలంక జలాల్లోకి ప్రవేశించాం. రామేశ్వరం వద్ద మూడు కిలోమీటర్లు శ్రీలంక పరిధిలోని సముద్ర జలాల్లోకి పడవ వెళ్లడాన్ని ఆ దేశ నేవీ అధికారులు మమ్మల్ని గుర్తించారు. శ్రీలంక ఫిషరీష్ అధికారుల వద్దకు మమ్మల్ని తీసుకుని వెళ్లారు. వారు మా వివరాలు తెలుసుకుని అన్నీ మాకు అనుకూలంగానే రాసుకున్నా రు. తర్వాత ఇండియన్ ఎంబసీ వచ్చి మా వివరాలు నమోదు చేసుకున్నారు భోజనం పెట్టి బాగా చూసుకున్నారు. మరుసటి రోజు ఉదయం జాఫ్నా పోలీసులకు అప్పగించారు. ఆగస్టు 4 నుంచి జాఫ్నా జైలులోనే ఉన్నాం. అక్కడ జైలులో ఐదు వేల మంది ఖైదీలు ఉన్నారు. వారిలో తమిళనాడుకు చెందిన వారే ఎక్కువ మంది. జైలులో వసతులు కూడా బాగానే ఉన్నాం.

సుమారు నాలుగుసార్లు కోర్టు వాయిదాలకు వెళ్లాం. చివరికి ఈనెల 12న అక్కడి కోర్టు విడుదలకు జడ్జి ఆదేశాలిచ్చారు. అయితే శ్రీలంక నేవీ, కోస్టుగార్డు అధికారులు ఆదేశించినా అప్పగింత ఆలస్యమైంది. తమిళనాడు ఖైదీలు జైల్లోనే మగ్గిపోతున్నారు. దారి తప్పిన తమిళనాడు మత్స్యకార బోట్లు సుమారు 500 వరకు అక్కడే ఉన్నాయి. వాళ్ల జడ్జి మమ్మల్ని వదిలేయడం చూసి ఆశ్చర్యపోయారు." అంటూ కాకినాడ జగన్నాథపురం ప్రాంతానికి చెందిన మత్స్యకారులు శ్రీలంకలో తాము ఎదుర్కొన్న అనుభవాలను వివరించారు. ప్రస్తుతం పాండిచ్చేరికి దగ్గరలో ఉన్నామని, 30వ తేదీ సాయంత్రానికి కాకినాడ చేరుకుంటామన్నారు. ఇక్కడంతా వాతావరణం వర్షం, ఉరుములు, మెరుపులతో భయంకరంగా ఉందని, గంట గంటకీ తమ క్షేమ సమాచారం మెసేజ్ కోస్ట్‌గార్డ్‌కు ఇస్తున్నామని, ముందు వెళుతోన్న షిప్‌ను అనుసరిస్తూ వస్తున్నామని కాకినాడకు తిరిగివస్తున్న కాకినాడ జగన్నాథపురం చంద్రిక థియేటర్, మల్లిపూడి వారి వీధికి చెందిన పంతాడి బ్రహ్మానందం, చింతా నాగేశ్వరరావు(భైరవపాలెం, యానాం సావిత్రినగర్, కొప్పాడి శ్రీను ఏటిమొగ, కర్రి నూకరాజు(గంగవరం మండలం మసకపల్లి) పేర్కొన్నారు.

ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు

శ్రీలంక కోర్టు కాకినాడ మత్స్యకారులను విడుదల చేయాలని సెప్టెంబరు 12న ఆదేశించినా అక్కడ కోస్ట్‌గార్డు, నేవీ అధికారులు సకాలంలో స్పందించలేదు. దీంతో బందీలైన మత్స్యకారుల కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. దీంతో వారు విషయాన్ని ఎంపీ సానా సతీష్‌బాబు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. ఏపీ భవన్ కమిషనర్ డాక్టర్ ఆర్జా శ్రీకాంత్ దృష్టికి తీసుకువెళ్లి మత్స్యకారులను స్వదేశానికి తీసుకువచ్చేలా చూడాలని కోరడం, ఆయన కోస్ట్‌గార్డ్ కమాండర్ దినేష్‌జేతో చర్చించి విడుదలకు దారి చూపారు. శ్రీలంకలో బందీలైన తమ వారిని స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు కృషి చేసిన సీఎం చంద్రబాబు, ఎంపీ సానా సతీష్, ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీలకు మత్స్యకారుల కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

ఇద్దరు దొంగలు.. 97 చోరీలు..

అంతర్ రాష్ట్ర దొంగలను పట్టుకున్న బొమ్మూరు పోలీసులు

రూ.9.98 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్య కిషోర్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): బొమ్మూరు పోలీసులు అంతర్ రాష్ట్ర దొంగల ఆటకట్టించారు. ఈస్ట్ జోన్ డీఎస్పీ భవ్య కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు ఫ్రూట్ మార్కెట్ సమీపంలో నివాసం ఉంటున్న క్యానం అన్వేష్ కుటుంబంతో తల్లి అస్తికలు కాశీలో కలపడానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి బెడ్‌రూం చిందరవందరగా ఉంది. బంగారం వస్తువులు, నగదు కనిపించలేదు. దీనిపై బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో డీఎస్పీ భవ్యకిషోర్ పర్యవేక్షణలో సీఐ కాశీ విశ్వనాథ్ తన బృందంతో దర్యాప్తు ప్రారంభించారు. ఇద్దరు వ్యక్తులు హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండ గా పట్టుకున్నారు. వాళ్లను ప్రశ్నించి ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్నారని నిర్ధారించుకు న్నారు. దీంతో ఒడిశాలోని జాగ్మేరా భువనేశ్వర్‌కి చెందిన ప్రశాంత కుమార్ కరాడా, గంజాంకు చెందిన సాగర్ కుమార్ పాండాను అరెస్టు చేశామని డీఎస్పీ వివరించారు. ఈ ఇద్దరూ 2000వ సంవత్సరం నుంచి నేరాలు చేస్తున్నారు. విశాఖ పట్నం ప్రాంతంలో 11, కాకినాడ 4, గుంటూరు 3, ఒడిశాలోని బరంపురం 5, బైద్యనాథ్ 4, బడా బజార్ 5, గుస్సాన్ 8, హైదరాబాద్‌లోని కూక ట్‌పల్లి 6, నాగ్‌పూర్ ప్రతాప్‌నగర్‌లో 10తో కలిపి సుమారు 97 కేసులు ఉన్నాయి" అని డీఎస్పీ తెలిపారు. ప్రశాంత్ కుమార్ కరుడుగట్టిన దొంగ అని, నాలుగేళ్ల నుంచి తప్పించుకొని తిరుగుతున్నాడని చెప్పారు. కలకత్తాలో ఓ సారి కాల్పులు కూడా జరిపాడన్నారు. నిందితుల నుంచి రూ.9.98 లక్షల విలువైన నగదు, నగలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. క్లిష్టమైన కేసును నెల రోజుల్లో పరిష్కరించడంలో ప్రతిభ చూపిన సీఐ కాశీ విశ్వనాథం, ఎస్ఐ మురళీ మోహన్, హెచ్‌సీలు వెంకటేశ్వరరావు, ప్రసాద్, వెంకట రమణ, పీసీలు సురేశ్ బాబు, మనికంఠ, హరీశ్, పూర్ణిమా రాజ్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



మరణించిన రంగబాబు

గండేపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామం జాతీయ రహదారిపై మోటారుసైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని జగ్గంపేట వైపు నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాల ప్రకారం.. గండేపల్లి గ్రామానికి చెందిన బోసనకూరి రంగబాబు(40) గండేపల్లి నుంచి రాజమహేంద్రవరం పని నిమిత్తం వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొని ఆపకుండా వెళ్లిపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు క్షతగాత్రుడిని జీఎస్ఎల్‌కు తరలించారు. అయితే అతడు అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. స్థానిక ఎస్ఐ శివనాగబాబు నెంబరు బోర్డు ద్వారా కారుని వెంబడించడంతో ఆచూకీ లభ్యమైంది. వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

భార్య పుట్టింటి నుంచి రాలేదని భర్త ఆత్మహత్య

తొండంగి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పిల్లలతో భార్య పుట్టింటికి వెళ్లిపోయి రాకపోవడంతో మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాకినాడ జిల్లా తొండంగి మండలం ఒంటిమామిడిలో జరిగింది. ఎస్.రాయవరం మండలం ఉప్పరాపల్లి గ్రామానికి చెందిన కిల్లాడ శివ (34)కు ఎలమంచిలి మండలం గుండురుబిల్లికి చెందిన దుర్గతో సుమారు 8 ఏళ్ల క్రితం వివాహమయ్యింది. తొండంగి మండలం ఒంటిమామిడి వచ్చి జీవిస్తున్నారు. శివ ప్రస్తుతం తొండంగి గ్యాస్ ఏజన్సీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసగా మారడంతో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో దుర్గ తన ఇద్దరు పిల్లలు శ్రావ్య, తేజలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. భార్యను తిరిగి వచ్చేయమని శివ ఫోనులో కోరేవాడు. ఆమె ఎంతకీ తిరిగి రావకపోవడంతో మనస్తాపం చెందిన శివ శనివారం ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. స్థానికులు గమనించి భార్యకు తెలిపారు. దీనిపై దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొండంగి ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తుల ముసుగులో దొంగతనాలు

అన్నవరంలో ఇద్దరి అరెస్ట్



పట్టుబడ్డ నిందితులు

అన్నవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భక్తులే వారికి టార్గెట్. రత్నగిరిపై వ్రతమండపాల్లో భక్తులు టెంకాయిలు కొట్టే సమయంలో జేబులో నగదు, చేతికి ఉంగరాలు, ఇతర వస్తువులు చాకచక్యంగా కొట్టేస్తుంటారు. కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో భక్తుల ముసుగులో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం రూ.300 వ్రత మండపం వద్ద ఈ విధంగా చేయడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న భద్రత సిబ్బంది పట్టుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అన్నవరం ఎస్ఐ హరిబాబు కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.11500 సొత్తును స్వాధీనం చేసుకుని, హైదరాబాద్‌కు చెందిన భక్తుల నగదుగా గుర్తించి వారికి అందజేశారు. నిందితులను గుంటూరు జిల్లా తాడేపల్లి సెంటర్‌కు చెందిన ఇట్ట సత్యనారాయణ, బాలసాని వెంకటభాస్కరరావుగా గుర్తించినట్టు సమాచారం. దీనిపై ఎస్ఐ మాట్లాడుతూ నిందితులు గతంలో చేపట్టిన నేరాలపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గోదావరిలో యువకుడి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

అలమూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు వద్ద గోదావరిలో శనివారం సాయంత్రం యువకుడి మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశా రు. మండపేట మండలం తాపేశ్వరం గ్రామానికి చెందిన సురేష్‌కుమార్ ఆరు రోజుల క్రితం రాజమహేంద్రవరం గోదావరి పుష్కర్‌ఘాట్ వద్ద స్నానం చేస్తుండగా మునిగిపోయి గల్లంతు అయినట్లు బంధువులు తెలిపారు. మృతదేహాన్ని గుర్తించి బయటకు తీసి తరలించారు.

డొంకరాయి 7వ గేటు ఎత్తివేత



విడుదలవుతున్న వరద నీరు

మోతుగూడెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లోని డొంకరాయి ప్రధాన ఆనకట్ట 7వ గేటును 2.90 అడుగుల మేర ఎత్తి 3వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు డ్యామ్ ఏఈ శివశంకర్ తెలిపారు. ఈ ప్రధాన ఆనకట్ట గరిష్ఠ నీటి మట్టం 1037 అడుగులు కాగా గత వారంరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు శనివారం సాయంత్రానికి ఆనకట్ట నీటి మట్టం 1035.60 అడుగులకు చేరుకుంది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 3వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఏఈ శివశంకర్ తెలిపారు. రాత్రంతా పెట్రోలింగ్ చేస్తూ నీటి మట్టం సాధారణ స్థితికి వచ్చిన తర్వాత గేటును మూసివేస్తామన్నారు.

పీఆర్‌లో వృక్షశాస్త్ర, సూక్ష్మ జీవశాస్త్ర విభాగాలచే

జాతీయస్థాయి సదస్సు



సదస్సుకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఆంజనేయులు, అతిథులు, అధ్యాపకులు

కాకినాడరూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి):కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల ఆంజనేయులు అధ్యక్షతన వృక్షశాస్త్ర, సూక్ష్మజీవశాస్త్ర విభాగాలచే శనివారం జాతీయస్థాయి సదస్సు నిర్వహించారు. ఈసదస్సుకు కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ చికిలే జాన్‌శామ్యూల్ కన్వీనర్‌గాను, సూక్ష్మజీవశాస్త్ర అధ్యాపకులు చీడి సుధాకర్ కోకన్వీనర్‌గానూ, ఐక్యూ ఏసీ సమన్వయకర్త డాక్టర్ పి.హరిరామప్రసాద్ పర్యవేక్షకుడిగానూ వ్యవహరించారు. ప్రిన్సిపాల్ ఆంజనేయులు, అతిథులు మొక్కల ఆధారిత ఔషదాలతో సుస్థిరజీవనం, ప్రపంచ శ్రేయస్సు అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కేరళలోని సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ టి.డెన్నిస్ థామస్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఏ.అమృతవల్లీ, అక్నూ ప్రొఫెసర్ టి.పద్మావతి, సౌత్ అమెరికాలోని యూనివర్శిటీ ఆఫ్ ఫ్లోరిస్ ప్రొఫెసర్ కె.కృష్ణమోహన్ ముఖ్య వక్తలుగా పాల్గొని సదస్సులో ఔషద మొక్కల ప్రాముఖ్యత, ప్రకృతిలో సూక్ష్మజీవుల ప్రాధాన్యం గురించి వివరించారు. విద్యార్థులు ఏర్పాటుచేసిన 150ఔషద మొక్కల ప్రదర్శనను అతిథులు, వక్తలు సందర్శించారు. సదస్సులో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైనేజీ, పంట కాలువల ఆక్రమణలు తొలగించాలి

● తిమ్మాపురంలో డెత్, బర్త్ సర్టిఫికెట్లకు అక్రమ వసూళ్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి

సర్పవరంజంక్షన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో డ్రైనేజీ, పంట కాలువలపై ఆక్రమణలు పెరిగిపోయాయని, వీటిని గుర్తించి, ఆక్రమణల తొలగింపుకి అధికారులు చర్యలు తీసుకోవాలని, కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలని స్థానిక ప్రజాప్ర తినిధులు డిమాండ్ చేశారు. శనివారం రమణయ్యపేట మండల పరిషత్ కార్యాలయంలో కాకినాడరూరల్ మండల పరిషత్ సర్వసభ్యుల సమావేశం ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐకమత్యంగా కృషిచేద్దామని, మండలాన్ని ఎమ్మెల్యే పంతం నానాజీ సహకారంతో అభివృద్ధి పథంలో నిలుపుదామని ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి కోరారు. ఈ సందర్భంగా తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామంలో రెవెన్యూ, పంచాయతీ అధికారుల అవినీతి పెరిగిపోయిందని, జనన, మరణాల సర్టిఫికెట్ల కోసం ఒక్కో సర్టిఫికెట్‌కి సుమారు రూ.2 నుంచి రూ. 3వేలు, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ (ఎఫ్‌ఎంసీ) సర్టిఫికెట్ జారీ కోసం రూ.5వేలు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కొత్తగా మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి గ్రామస్థుల నుంచి అక్రమ వసూళ్లకు తెరతీశారని ఆరోపించారు. నేమాంలో మెయిన్‌రోడ్డుకు ఆనుకుని ప్రభుత్వ పోరంబోకుకు చెందిన సుమారు 2.50ఎకరాల భూమి ఆక్రమణకు గురైందని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఆగ్రామ సర్పంచ్ రాం దేవు చిన్న డిమాండ్ చేశారు. శ్మశానవాటిక ప్రహరీగోడ నిర్మా ణానికి నిధులు మంజూరు చేయాలని గత సమావేశంలో కోరగా, ఎమ్మెల్యే నానాజీ సానుకూలంగా స్పందించినా నేటికీ అధికారులు పట్టించుకోవడంలేదని కొవ్వాడ సర్పంచ్ కోటిపల్లి ఉమ ఆవేదన వ్యక్తం చేశారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రైతులకు ఉపయోగపడే పంట కాలువల తవ్వకం, పలు రోడ్ల కోసం ప్రణాళిక తయారు చేసివ్వాలని ఎన్‌ఆర్ ఈజీఎస్ ఏపీవో గణేష్ కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పసుపులేటి సతీష్, తహ శీల్దార్ ఎస్‌ఎల్‌ఎన్ కుమారిలు మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. తిమ్మాపు రంలో సభ్యులు ఆరోపించిన విషయాలపై విచారణ నిర్వహిస్తామని, ఎక్కడైనా జరిగితే తన దృష్టికి నేరుగా తీసుకువస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కాకినాడరూరల్ జడ్పీ టీసీ నులుకుర్తి రామకృష్ణ (కిట్టూ), వైస్ ఎంపీపీ బిందిరి వీరేష, డిప్యూటీ ఎంపీడీవో ఎంఎస్‌ఆర్ ఆంజనేయులు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీలో ఛాన్స్ కొట్టిన పంచాయతీ కార్యదర్శి రమణ



ఇనుమర్తి వీవీ రమణ

కొత్తపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వంలో గ్రూప్3లో పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం పొంది, మరలా ఇటీవల కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ (పీడీ)గా ఉద్యోగం పొందాడు కొత్తపల్లి రమీంద్రపురానికి చెందిన ఇనుమర్తి వీవీ రమణ. 2016 అప్పటి తెలుగుదేశం ప్రభు త్వంలో నిర్వహించిన గ్రూప్-3 నోటిఫికేష న్‌లో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించి రాజవొమ్మంగి, శంకవరం, గొల్లప్రోలు మండలాల్లో పనిచేశారు. ప్రస్తుతం కిర్లంపూడి మండలం క్రిష్ణవరం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ జూన్ నెలలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో పాల్గొని ఫిజికల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించినట్లు రమణ తెలిపారు. అమరావతిలో ఫిజికల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్‌ఆ పాయిమెంట్‌ను అందుకున్నానని రమణ తెలిపారు.

పాదగయలో ఏలూరు రేంజ్ ఐజీ పూజలు



పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

పిఠాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ శనివారం సందర్శించారు. కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్, ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్‌తో కలిసి పాదగయలోని కుక్కుటేటశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రప్రాశస్త్యం గురించి వేదపండితులు వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఐజీ, ఎస్పీలను శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. వీరి వెంట ఎస్‌బీ డీఎస్పీ కేవీవీ సత్యనారాయణ, పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ ఉన్నారు.

'ఉద్యోగుల'పై వేధింపులు అరికట్టాలి

● డీబీఎఫ్ జాతీయ కో ఆర్డినేటర్ చంగల్‌రావు డిమాండ్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

కాకినాడసిటీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దళిత, వెనుకబడిన తరగతుల ఉద్యోగులపై వేధింపులు అరికట్టాలని, డీఎల్‌పీవో కార్యాలయ ఏవోను తక్షణం సస్పెండ్ చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కో ఆర్డినేటర్ తోటి చంగల్‌రావు డిమాండ్ చేశారు. ఎస్సీ, బీసీ ఉద్యోగులపై తరచూ వేధింపులకు పాల్పడుతున్న జిల్లా పంచాయతీ కార్యాలయ ఏవో వెంకటరెడ్డిపై చర్యలు తీసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంవద్ద దళిత సంఘాల నా యకులు ధర్నా చేశారు. అనంతరం జిల్లా అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ కో ఆర్డినేటర్ తోటి చంగల్ రావు, ఆంధ్ర మాల మహానాడు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు, జై భీమ్‌రావు పార్టీ రాష్ట్ర నాయకుడు ఏనుగుపల్లి కృష్ణ మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో వెంకటరెడ్డి, అతని సామా జిక వర్గానికి చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధుల అండదండలతో ఎస్సీ, బీసీ ఉద్యోగులపై వేధింపులకు పాల్పడ్డారన్నారు. పొన్నాడ పంచాయతీకి సంబంధం లేని నాగులాపల్లి, కొండెవరం పంచాయతీలకు చెందిన కొందరు వెంకటరెడ్డి చెప్పిన ఎస్సీ, బీసీ ఉద్యోగులపై తరచూ అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. అదేవిధంగా పొన్నాడ పంచాయతీ కార్యదర్శి సియోన్ కుమార్‌ను బదిలీ చేయాలని పీజీఆర్ఎస్‌లో పదే పదే తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. గతంలో ఏవో సీహెచ్ వెంకటరెడ్డిపై వచ్చిన అవినీతి ఆరోపణలు, నిధుల దుర్వినియోగంపై సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐ ఆర్ నమోదైందన్నారు. అదేవిధంగా 12వ ఆర్థికసంఘం నిధులు తాలూకు వడ్డీని తన ఖాతాకు మళ్లించుకున్నాడన్నారు. సర్వీసులో ఉండగా మరణించిన వారి కుటుంబ సభ్యులకు బెనిఫిట్స్ అందజేయకుండా తన చుట్టూ తిప్పించుకుంటూ మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడన్నారు. తక్షణం అతనిపై విచారణ చేపట్టి ఎస్సీ, బీసీ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని, లేనిపక్షంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి గుబ్బల ఆదినారాయణ పాల్గొన్నారు.

తొలి తిరుపతికి ..

పోటెత్తిన భక్తులు



కొలువుదీరిన స్వామివారు

పెద్దాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలితిరుపతి శృంగార వల్లభస్వామి క్షేత్రానికి శనివారం సుమారు 10వేలమందికి పైగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రూ.4,77,983ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

కాకినాడలో డీజే టిల్లు ఫేమ్

నేహాశెట్టి సందడి



కాకినాడ మెయిన్‌రోడ్డులో సందడి చేస్తున్న హీరోయిన్ నేహాశెట్టి

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): డీజే టిల్లు ఫేమ్ హీరోయిన్ నేహాశెట్టి శనివారం కాకినాడలో ప్రియాంకతో కలిసి సందడి చేశారు. భారతదేశంలోనే అతి పెద్ద లగ్జరీ వెండి ఆభరణాల సంస్థ ఓ షోరూం ప్రారంభోత్సవానికి విచ్చేయడంతో ఆ ప్రాంతమంతా అభిమానులతో సందడిగా మారింది. ఈ సందర్భంగా అభిమానుల కోరిక మేరకు డీజే టిల్లు పాటకు డ్యాన్స్ చేసి అభిమానులను అలరించారు. ఈ సందర్భంగా హీరోయిన్ నేహాశెట్టి మాట్లాడుతూ కాకినాడ అంటే తనకెంతో ఇష్టమని ఎంతో ప్రశాంతంగా ఉంటుందన్నారు.సంస్థ అధినేత రవి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

కాకినాడ రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొవ్వాడలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా శనివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. దీన్ని రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ సీనియర్ నేత డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. డాక్టర్ దివ్య, సూపర్‌వైజర్ ఇబ్రహీం, మరియమ్మ, ఉమాదేవి హెల్త్ అసిస్టెంట్ చంద్రరావు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, కూటమి నేతలు శ్రీనివాసరావు, ప్రకాష్ గౌడ్, రమణ, ప్రకాష్, సత్యనారాయణ, రాఘవ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్ ప్రసాద్ సేవలు చిరస్మరణీయం

● రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రామ్మోహన్‌రావు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ తోట సుధాకర్ ప్రసాద్ సేవలు చిరస్మర ణీయమని రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రామ్మోహన్ రావు పేర్కొన్నారు. కాకినాడ కలెక్టరేట్ ఎదురుగా ఉన్న జిల్లా రెవెన్యూ భవనంలో శని వారం తోట వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల కోసమే జీవించి, వారి కోసమే తన చివరి శ్వాస విడిచిన పోరాట యోధుడు కామ్రేడ్ సుధాకర్ ప్రసాద్ అని కొనియాడారు. ఆయన ఉద్యో గులకు చేసిన సేవలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతా యన్నారు. నిరంతరం అలుపెరగని పోరాటం చేశారన్నారు. అనంతరం ఆయన జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డీ.దుర్గాప్రసాద్, ట్రెజరర్ వీరబాబు, కలెక్టరేట్ విభాగం ప్రతినిధి శివరామకృష్ణ, క్లాస్‌ఫోర్ అసోసియేషన్ అధ్యక్షులు పాపారావు, ఇతర అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్



మహిళలకు మందులు పంపిణీ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రతాప్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారీ సశక్త్ పరివార అభియాన్ కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న, కాకినాడ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, యేనిమిరెడ్డి మాలకొండయ్య, భారతీయజనతా పార్టీ కాకినాడ సిటీ సెంట్రల్ మండలం అధ్యక్షురాలు గోడి సత్యవతితో కలిసి శనివారం ఆరోగ్య శిబిరం ప్రారంభించారు. స్వస్థనారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాకినాడ ప్రతాప్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు వి.అరుణ, డాక్టర్ జీ.లక్ష్మి, డీపీఎంవో, మెడికల్ ఆఫీసర్ అజీజ్, జనరల్ ఫిజిషన్, గైనకాలజిస్టు సమక్షంలో వివిధ సమస్యలతో బాధపడుతున్న మహిళలకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. బిక్కిన విశ్వేశ్వరరావు ఆరోగ్య శిబిరంలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వైద్య పరీక్షలకు హాజరైన మహిళలతో మాట్లాడారు. వైద్య పరీక్షలు అనంతరం ఆయన చేతులతో మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేదలు, ఆడపిల్లలు, ఆరోగ్యం కాపాడేందుకు ప్రధానిమంత్రి నరేంద్రమోడీ స్వస్త నారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించామన్నారు. ఆరోగ్యవంతమైన మహిళే కుటుంబానికి పునాది, మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఇంటిల్లిపాది బాగుంటారన్నారు. పోషకాహారం మాసోత్సవాలను మహిళ శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో చిన్నారులకు బరువు, ఎత్తు కొలవడంతో పాటు రక్తహీనతతో బాధపడుతున్న వారికి అందించాల్సిన పోషకాహారంపై తల్లులకు అంగన్వాడీ కార్యకర్తలు స్టాల్స్ ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చోడిశెట్టి రమేష్, మోసలిగట్టి సురేష్, జ్యోతుల రాజేష్, శ్రీహరి, గౌతు చిన్న, తదితరులు పాల్గొన్నారు.

నేడు కాకినాడ ఆదిత్య అకాడమీలో

మెగా డీఎస్సీ అభ్యర్థుల విజయోత్సవ సభ

కాకినాడరూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆదిత్య అకాడమీలో శిక్షణ పొంది మెగా డీఎస్సీ - 2025లో 190 మంది ఉపాధ్యాయులుగా ఎంపికైన సందర్భంగా ఆదివారం అభినందన సభను ఏర్పాటు చేయనున్నారు. శ్రీనగర్‌లోని అకాడమీలో నిర్వహిస్తున్నట్టు అకాడమీ కార్యదర్శి పీబీ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాఠశాల విద్య జోన్-2 ఆర్జేడీ జీనాగమణి పాల్గొంటున్నారన్నారు. ఆమె సమక్షంలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులను, వారి కుటుంబ సభ్యులను సత్కరించనున్నామన్నారు. దీనికి తప్పనిసరిగా విజయం సాధించినవారంతా హాజరుకావాలన్నారు.

ప్రభుత్వ వైద్యకళాశాలలో ప్రైవేట్ భాగస్వామ్యం వద్దు

● కలెక్టరేట్ ఎదుట వైసీపీ లీగల్ బృందం నిరసన

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రైవేట్ భాగస్వామ్యం విధానాన్ని రద్దు చేయాలని వైసీపీ లీగల్ సెల్ బృందం డిమాండ్ చేసింది. ఈమేరకు శనివారం కాకినాడ కలెక్టరేట్ ఎదుట లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆదిత్య కుమార్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రైవేట్ భాగస్వామ్యం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతి పత్రం ఇచ్చారు. న్యాయవాదులు విశ్వనాథరెడ్డి, బోలోదు రాజా, బాల కృష్ణ, నాగేంద్ర, పితాని శ్రీనివాసు, గెద్దాడ వెంకటేశ్వరరావు, కలిదిండి శ్రీనివాసు, నున్న కృష్ణ, శ్రీనాథ్, కళ, ప్రసన్న, శ్వేత పాల్గొన్నారు.

అలరించిన దసరా నృత్య మహోత్సవం

● గోదావరి కళాక్షేత్రంలో నిర్వహణ

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నృత్యాంజలి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన దసరా నృత్య మహోత్సవం, శక్తి పుర స్కార్-2025 ప్రదానోత్సవంలో చిన్నారుల నృత్యప్రదర్శన అలరించింది. సంస్థ డైరెక్టర్, ప్రముఖ నాట్యాచార్యుడు హరిగురు శరవణ, ఫ్యాబిన్ కన్వెన్షన్ సీఈఓ తేజానాయుడు ఆధ్వర్యంలో మహోత్సవ వేడుకలను రాజా ట్యాంక్ పార్కు వద్ద గల గోదావరి కళాక్షేత్రంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుగ్రహీత, సభ్యులు వేదాంతం రామలింగా శాస్త్రి, వసంత కిరణ్ హాజరయ్యారు. అతిథులుగా నృత్యాంజలి అకాడమీ వ్యవస్థాపకులు హరి లోకేష్, కృష్ణవేణితో పాటు నగరానికి చెందిన ప్రముఖ నాట్యాచార్యులు పాల్గొన్నారు. పోటీల్లో భాగంగా విజేతలకు ముఖ్యఅతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరిగింది. కార్యక్రమంలో తదితరులున్నారు.

రేపు పిఠాపురం మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

పిఠాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో ఈనెల 29న ఉదయం 11గంటలకు జరుగుతుందని కమిషనరు నామ కనకారావు తెలిపారు. చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన సమావేశంలో కౌన్సిల్ అజెండాలోని అంశాలతో పాటు సభ్యులు ప్రస్తావించే అంశాలపై చర్చించడం జరుగుతుందని చెప్పారు.

కాకినాడలో జీఎస్టీ 2.0పై అవగాహన



నగర ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలు విస్తృతంగా చేరువ చేయాలనే ఉద్దేశంతో కాకినాడలో అధికారులు అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. శనివారం సాయంత్రం నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కేటి సుధాకర్ ఆదేశాల మేరకు 44, 45 డివిజన్ల పరిధిలో టీపీఆర్వో శైలజ పర్యవేక్షణలో డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. స్వయం శక్తి సంఘాల మహిళలు ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేసి, జీఎస్టీ తగ్గింపు ద్వారా ఎంత ఆదా అవుతుందో, ప్రజలకు ఏవిధంగా లబ్ధి కలుగుతుందో వివరించారు. అనంతరం దసరా ఉత్సవాల పందిళ్ల వద్ద ప్రజలనుద్దేశించి ప్రత్యేక అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో రైతులు ఎరువులు, ట్రాక్టర్లు, పురుగు మందులు, వాటర్ పైపులు, మోటార్లు వంటి వ్యవసాయ అవసరాలపై, అలాగే టూత్‌పేస్టులు, బ్రష్‌లు, నిత్యావసర వస్తువులు, వాహనాలు, మందులు వంటి ఉత్పత్తులపై గణనీయమైన ప్రయోజనం లభిస్తోందని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో జీఎస్టీ శాఖాధికారులు బాలసుబ్రహ్మణ్యం, అజయ్‌కుమార్, విజయానందం, కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది, మహిళా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చినరాజప్పను కలిసిన నూతన టీచర్లు



డీఎస్సీ విజేతలతో ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పారదర్శకంగా టీచర్ పోస్టులు భర్తీ చేసినందున ప్రభుత్వం విద్యా లక్ష్యాలను సాధించే దిశలో నూతన టీచర్లంతా కృషిచేయాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సామర్లకోట మండల స్థాయిలో డీఎస్సీలో ఉపాధ్యాయ నియామకాలు పొందిన 64 మంది శనివారం ఎమ్మెల్యేను తన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతా పూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముందుగా నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలో భాగంగా సీఎం మెగా డీఎస్సీ నిర్వహించారన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు వై.శివరామ కృష్ణయ్య, పట్టపగలు పుల్లయ్య, టీడీపీ నాయకులు రాజా సూరిబాబురాజు, బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, బలుసు శ్రీనివాసు, చీకట్ల వెంకటేష్, ముసిరెడ్డి శ్రీరాములు, బొందల రామలక్ష్మి, కొప్పిరెడ్డి రాజా, దేవళ్ల శివ, శెట్టిబత్తుల దుర్గ కౌన్సిలర్ యార్లగడ్డ జగదీష్ పాల్గొన్నారు.

డీఎస్సీకి ఎంపికైన

ఏడుగురు పూర్వ విద్యార్థులకు సత్కారం



నూతన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న నాయకులు

కాజులూరు (కరప), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గొల్లపాలెం హైస్కూల్‌కు చెందిన ఏడుగురు పూర్వ విద్యార్థులు ఒకేసారి డీఎస్సీకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక హైస్కూల్‌లో శనివారం పీడీ పి.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సత్కరించారు. గ్రామానికి చెందిన సీహెచ్ శ్రీనివాసరావు పీఈటీగాను, పోతురాజు శ్రీను, వనుం తనోజ్‌కుమార్, ఓలేటి మైథిలి ఎస్ఏఎఫ్ఈలగా, మాసాబత్తుల శ్రీనుబాబు ఎస్ఏ బయాలజీగా, పోతురాజు వెంకటేష్‌బాబు, డేగల రవళి ఎస్జీటీగా నియమితులయ్యారు. వారందరినీ గ్రామ సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక, ఉపసర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ అంగర కృష్ణ, ఎస్ఎంసీ ఛైర్మన్ ముర్రే శివశంకర్, తదితరులు అభినందించారు. నేతలు చిన్నా, రాంబాబు, నాగేశ్వరరావు, శ్రీను, వెంకటరమణ, రాజ్‌పటేల్, వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత

సామర్లకోట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన గనిశెట్టి గీతా మాధవ్ అనే వ్యక్తికి ఆరోగ్య వైద్యం నిమిత్తం మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ నగదు చెక్ రూ.30,541లను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శనివారం అందజేశారు. అచ్చం పేటలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకుడు చల్లా బుజ్జి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాధితుడు గీతామాధవ్‌కు ఎమ్మెల్యే అందజేశారు.


కాకినాడలో జపమాల అవతారంలో త్రిపురసుందరి


లలితా త్రిపుర సుందరిగా కాండ్రకోట నూకాలమ్మ


పిఠాపురం పాదగయ క్షేత్రంలో కాళికాదేవి


సామర్లకోటలో శ్రీవిజయదుర్గాదేవిగా బాలాత్రిపుర సుందరి


నడకుదురులో లలిత త్రిపురసుందరిగా అమ్మవారు

బాలాత్రిపురసుందరిగా అమ్మవారి దర్శనం

● ఘనంగా శరన్నవరాత్రి పూజలు

● అమ్మవార్ల నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : జపమాల అవతారంలో శ్రీ బాలాత్రిపురసుందరి అమ్మవారు శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక సూర్యారావుపేటలోని శ్రీబాలాత్రిపురసుందరి సమేత శ్రీ రామ లింగేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు ఆరో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా నవావర్ణార్చన పూజ, చండీ హోమం జరిపారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ గ్రంధి బాబ్జి, ఈవో వుండవల్లి వీర్రాజు చౌదరి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

స్వామి వారిని దర్శించుకున్న టీడీపీ పరిశీలకుడు

కాకినాడసిటీ నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు దేశంశెట్టి లక్ష్మీనారా యణ దంపతులు శనివారం సాయంత్రం శ్రీ బాలాత్రిపురసుందరి సమేతశ్రీరామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ గ్రంధి బాబ్జి స్వాగతం పలికి స్వామివారి తీర్థప్రసాదాలు, వస్త్రాలు అందజేశారు. కూటమి నాయకులు నల్లారి శ్రీనివా స్, చెక్కా ప్రకాష్, ముత్యాలరాణి, పెమ్మాడ సాయిప్రసన్న, ఉత్సవ కమిటీ సభ్యులు నెక్కంటి శ్రీనివాస్, తులసి పాల్గొన్నారు.

పెద్దాపురం(ఆంధ్రజ్యోతి): స్థానిక వర్ఘులవారి వీధిలో ఉన్న భువనేశ్వరి పీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు లలితా త్రిపురసుందరిదేవి అవతారంలో భక్తులకు శనివారం దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ ఆధ్వర్యంలో పలు పూజా కార్యక్రమా లు, అభిషేకాలు, భజనలు నిర్వహించారు. పెద్దాపురం మరిడమ్మ, కాండ్రకోట నూకాలమ్మ దేవస్థానాల్లో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మ వార్లు లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈవోలు కె.విజయలక్ష్మి, ఎం.రాంబాబురెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కాళికాదేవి అలంకారంలో రాజరాజేశ్వరీదేవి

పిఠాపురం(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రం కుక్కుటేశ్వరస్వామివారి సన్నిధిలో ఉన్న రాజరాజేశ్వరిదేవి, పురుహూతికా అమ్మవార్ల శరన్నవరాత్రి శతచండీ యాగ మహోత్సవాల ఆరవరోజు శనివారం విశేష పూజలు జరిగాయి. రాజరాజేశ్వరీదేవి కాళికాదేవి అలం కారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహాగణపతి స్వామి వారికి విఘ్నేశ్వరపూజ, కుక్కుటేశ్వర స్వామి, దత్తాత్రేయస్వామికి అభిషేకాలు, రాజరాజేశ్వరీదేవికి ప్రాతఃకాల విశేష సహస్రనామార్చన, కుంకుమార్చనలు జరిగాయి. అష్టాదశ శక్తిపీఠాల్లో దశమశక్తి పీఠానికి అధిష్ఠాన దేవత అయిన పుర్హుతికాఅమ్మవారికి విశేష అలంకరణ చేశారు. ఆదివారం రాజరాజేశ్వరీ అమ్మవారు సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఆలయ కార్య నిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ఇంద్రాణిదేవిగా మహాలక్ష్మీ అమ్మవారు

శృంగేరి శంకర మఠం నిర్వహణలో పిఠాపురం పెదబజారులో ఉన్న మహాలక్ష్మీ అమ్మవారు ఇంద్రాణిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చండీ పారాయణము, చండీహోమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు ఇంద్రగంటి వెంకటగోపాలకృష్ణ దంపతులు పూజాది కార్యక్రమాలు జరిపించారు.

కనకదుర్గమ్మకు పసుపుకొమ్ములతో అలంకారం

పిఠాపురం రూరల్(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.రాయవరంలో కనకదుర్గమ్మ లలిత త్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని పసుపుకొమ్ములతో అలంకరిచారు.

గొల్లప్రోలురూరల్(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపర్తి, దుర్గాడ తదితర గ్రామాల్లోని ఆలయాలు అమ్మవార్ల నామస్మరణతో మార్మోగాయి. తాటిపర్తి గ్రామంలో ఉన్న అపర్ణాదేవి దసరా శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శనివారం కాత్యాయుని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అపర్ణాదేవిని రుద్రాక్షమాలలతో అలంకరించారు. ఆలయ అర్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి పూజలు జరిపించగా కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తులసివనంలో నారాయణిమాతగా లలితాదేవి

దుర్గాడ శివాలయంలో తులసివనంలో నారాయణిమాతగా లలితాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి లలితా సహస్ర నామార్చన, కుంకుమార్చనలు జరిగాయి.

స్వయంవర పార్వతి అమ్మవారికి విశేష పూజలు

సామర్లకోట(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని ఆరవరోజైన శనివారం సామర్లకోట కుమారరామ భీమేశ్వరాయంలో ఉన్న బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి సుందరరామయ్య, అళక్కి రాజగోపాలశర్మ, కొంతేటి భీమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకటరమణల వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి విశేష పుష్పార్చన పూజలు, విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారిని లలితాదేవిగా సర్వాంగసుందరంగా అలంకరి ంచారు. అంతకుముందు భీమేశ్వరస్వామికి పంచద్రవ్యములతో అభిషేకించి నూతన పట్టువస్త్రాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. మహిషాసుర మర్ధని అమ్మవారి ఉపాలయం ఎదుట శ్రీచక్రపండితులు వేమూరి సోమేశ్వర శర్మ తదితర పండితులచే గణపతిహోమ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. నిత్యాన్నదాన పథకంలో సుమారు 1,300మంది భక్తులు అన్నప్ర సాదాలు స్వీకరించారు. దేవీశరన్నవరాత్రి విశేష పూజలలో భాగంగా శనివారం సామర్లకోట పట్టణంలోనూ, మండలంలోనూ పలు అమ్మవార్ల ఆలయాలలో విశేష పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమార్చన పూజలలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు

కరప(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నడకుదురు కనకదుర్గ ఆలయంలో శనివారం అమ్మవారు లలిత త్రిపురసుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. స్థానిక చీపురుపల్లి వారి వీధి నుంచి టీడీపీ సీనియర్ నేత చీపురుపల్లి జయేంద్రబాబు ఆధ్వర్యంలో ముత్తైదువులు పట్టువస్త్రాలు, పండ్లు, పూలు, పసుపు, కుంకుమ, పిండివంటలు, ఇతర సారె పట్టుకెళ్లి అమ్మవారికి సమర్పించి భక్తితో పూజలుచేశారు. కరప శివాలయంలో పర్వతవర్ధినీ దేవి జపమాల అవతారంలో దర్శనమివ్వగా భక్తులు పూజాదికాలు నిర్వహించారు.

దేవీస్కంద మాతాలంకరణలో లలిత పరమేశ్వరిదేవి

సర్పవరంజంక్షన్(ఆంధ్రజ్యోతి):కాకినాడరూరల్ ఏపీఎస్పీ హ్రీం పీఠంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం ఆరోరోజు శ్రీలలిత పరమేశ్వరిదేవి దేవీ స్కంద మాతాలంక రణలో దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపకులు ఈశ్వర్‌నాధ్ ఆధ్వర్యంలో వారాహి హోమం, నవదుర్గా హోమం ఘనంగా నిర్వహించారు. శ్రీశైలంలో జరిగే మాదిరిగా స్కంధ మాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, కూష్మాండ, చంద్రఘంట, సిద్ధిధాత్రి, శైలపుత్రి, బ్రహ్మచారిణి రూపంలో మహిళా భక్తులను అలంకరించారు. భక్తులకు అమ్మవారి ప్రసాదం పంపిణీ చేశారు.


సబ్‌జైల్‌లో వసతులను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి చంద్రమౌళీశ్వరి

సబ్ జైలును సందర్శించిన జిల్లా జడ్జి

పెద్దాపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌జైలును ఏడవ అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి శనివారం సందర్శించారు. ఖైదీల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వారికి పెట్టే ఆహార పదార్థాలు, మంచినీరు, జైలు పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీరమణి, డీఎస్పీ శ్రీహరిరాజు, పీడబ్ల్యూడీ ఈఈ శేషగిరిరావు, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ ప్రశాంతి, మెడికల్ ఆఫీసర్ రాజ్‌కుమార్, జైలు సూపరిండెంట్ రమణబాబు, అడ్వకేట్ ప్రభుజీ, పారా లీగల్ వలంటీర్ డి.లక్ష్మి, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పిఠాపురంలో పీజీఆర్ఎస్

పిఠాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పాతబస్టాండు వద్ద గల పాడా కార్యాలయంలో ఈనెల 29వ తేది సోమవారం ఉదయం 10గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు పాడా ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాలరావు తెలిపారు. ఈ పీజీఆర్ఎస్‌కు పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించిన అన్ని శాఖల డివిజన్, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో ప్రజలు తమ సమస్యలు, ఇబ్బందులపై అర్జీలు ఇవ్వవచ్చునని చెప్పారు. నేరుగా హాజరు కాలేనివారు ఆన్‌లైన్‌లో తమ ఫిర్యాదులు, వినతులు నమోదు చేయవచ్చునని తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

రేపటి నుంచి అక్టోబర్ 5 వరకు శిల్పారామంలో గాంధీ శిల్పి బజార్

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి):గాంధీ శిల్పి బజార్ డెవలప్మెంట్ కమిషనర్ హ్యాండీక్రాఫ్ట్స్, మినిస్ట్రీ ఆఫ్ టెక్స్టైల్స్ గవర్నమెంట్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి హస్తకళలు ప్రదర్శన, అమ్మకం పేరుతో గాంధీ శిల్పి బజార్‌ను కాకినాడ బీచ్ రోడ్‌లోని శిల్పారామంలో ఈనెల 29వ తేదీ నుంచి అక్టోబర్ 5వరకు నిర్వహిస్తామని హ్యాండీక్రాఫ్ట్ సర్వీస్ సెంటర్ విజయవాడ అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణ లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ ప్రజలందరూ ఈ హస్తకళా ఉత్సవంలో పాల్గొని మన హస్త కళలకు గౌరవాన్ని, హస్త కళాకారులకు చేయూతను అందించి మన భారతీయ సంస్కృతిని పరిరక్షించు కుందామని హ్యాండీక్రాఫ్ట్ సర్వీస్ సెంటర్ విజయవాడ ఏడీ అపర్ణ లక్ష్మి కోరారు.

డ్వాక్రా సొమ్ముల స్వాహాలో యానిమేటర్‌లకు సంబంధం లేదు

కరప, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కూరాడలో డ్వాక్రా సంఘాల సభ్యులు కట్టిన సొమ్ములు స్వాహాలో అక్కడ పనిచేస్తున్న యానిమేటర్‌లకు ఎటువంటి సంబంధంలేదని యానిమేటర్‌ల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు యు.సుధ, కె.సత్యలు స్పష్టం చేశారు. కరపలో శనివారం వారు మాట్లాడుతూ అక్కడ ఖాతాదారుల సేవాకేంద్రాన్ని నిర్వహిస్తున్న చిన్నం భారతి 40 సంఘాలకు సంబంధించిన బ్యాంక్ లావాదేవీలు జరుపుతుందన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులు చేసిన చెల్లింపుల్లో జరిగిన అవకతవకలన్నింటికీ భారతి మాత్రమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉందన్నారు. యానిమేటర్‌గా పనిచేస్తున్న ఆమె తల్లికి ఈ సొమ్ముల గోల్‌మాల్ వ్యవహారంలో ఎటువంటి ప్రమేయం లేదన్నారు. వీఓఏల సంఘం సభ్యులు సాధనాల పద్మావతి, మారెళ్ల లక్ష్మి, రొక్కాల సత్యవతి, మందపల్లి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

వేట్లపాలెంలో అనగనగా ఒక రాజు చిత్రం షూటింగ్


వేట్లపాలెంలో అనగనగా ఒక రాజు చిత్రం షూటింగ్ సన్నివేశం

సామర్లకోట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో ప్రముఖ భేతాళ స్వామి ఆలయం ఎదుట శని వారం సితారా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ప్రముఖ దర్శకులు మారి దర్శకత్వంలో అనగనగా ఒకరాజు చిత్రం షూటింగ్ సన్నివేశాలు చిత్రీకరించారు. టాలీవుడ్ హీరో నవీన్ పోలిశెట్టి హీరోయిన్ మీనాక్షీచౌదరిలు జంటగా చిత్రీకరి స్తున్న ఈ చిత్రంలో ప్రధాన ఘట్టం అయిన హీరో, విలన్‌లమధ్య గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎన్నికల ప్రచారసభల దృశ్యాలను వేలాది ఆహుతుల మధ్య దర్శకులు మారి చిత్రీకరించారు. ఇంకా ఈ చిత్రంలో జబర్దస్త్ చంద్ర, మహేష్, భద్రం తదితరుల మధ్య కొన్ని హాస్య సన్నివేశాలు కూడా చిత్రీకరించారు.

సంక్రాంతికి విడుదలకు సన్నాహాలు

పూర్తి గ్రామీణ వాతావరణంలో హాస్యభరితంగా అనగనగా ఒక రాజు చిత్రం శరవేగంతో చిత్రీకరిస్తున్నామని 2026 సంక్రాంతికి తమ చిత్రం విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వర్ధమాన దర్శకుడు మారి చెప్పారు. శనివారం వేట్లపాలెంలో దర్శకులు మారి మాట్లాడుతూ కోనసీమలో ఓ యువకుడు, యువతీ మధ్య అప్ ట్రాక్, సంక్రాంతి సంబరాలు అన్నింటినీ కలిపి ఓ ఫుల్ ఎంటర్‌టైనర్‌ను అందించబోతున్నట్లు తెలిపారు.

దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఉమా మనో వికాసం కేంద్రం

● కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్


దివ్యాంగులకు కృత్రిమ పరికరాలు అందిస్తున్న కాకినాడ ఎంపీ ఉదయశ్రీనివాస్

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులకు విద్య, ఆరోగ్య, పునరావాసం, జీవనోపాధి, కృత్రిమ పరికరాలు కల్పిస్తూ వీరి జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఉమా మనోవికాస కేంద్రం సేవలు స్ఫూర్తిదాయకమని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ అన్నారు. శనివారం వాకలపూడి ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్పీ రెడ్డి ఆధ్వర్యంలో హర్యానా గురుగ్రామ్‌కు చెందిన ఇఫ్కో-టోకియో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆర్థిక సహకారంతో 94 మంది లబ్ధిదారులకు ట్రై సైకిళ్లు, కృత్రిమ కాళ్లు, కాలిపర్స్, వీల్‌ఛైర్లు, వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు, దివ్యాంగులకు సేవలుఅందించడంలో కుటుంబ సభ్యులకే ఇబ్బందిగా ఉంటుందని, అటువంటిది వీరి అభ్యున్నతి,సంక్షేమం, అభివృద్ధి కోసం సేవలు అందించడమంటే సామాన్య విషయం కాదన్నారు. విభిన్న ప్రతిభావంతుల అవసరాలు గుర్తించి, విశేష సేవలు అందిస్తున్నారన్నారు. సామాజికసేవలు చాలా మంది, సంస్థలు చేస్తారని, వీరికోసం ప్రత్యేక విద్య, సమీకృత, వృత్తి విద్య, సాంఘిక శిక్షణ అందిస్తూ జీవనోపాధి కోసం పునరావాస కార్యక్రమాలు అమలుచేస్తూ బంగారు భవిష్యతుకు ఉమాసంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రెడ్డి బా టలు వేస్తున్నారని అభినందించారు. ఇంతటి మంచి కార్యక్రమంలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని, భవిష్యత్‌లో ఉమా సంస్థకు అవసరమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రభుత్వపరంగా సంపూర్ణ తోడ్పాటు అందిస్తానన్నారు. జిల్లా దివ్యాంగుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు ఏవై శ్రీనివాస్, జిల్లా దివ్యాంగులశాఖ అధికారి ఎస్ వీఎస్ఎన్‌రెడ్డి, ఉమాసంస్థ జాయింట్ డైరెక్టర్ ఎస్.ఉమారెడ్డి, కె.నారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి పిడుగు పాండురంగారావు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్టు


దొంగను అరెస్టుచేసి వివరాలు తెలుపుతున్న సీఐ

సామర్లకోట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి):సామర్లకోట పట్టణంలో శనివారం పట్టపగలే గాంధీబొమ్మ సెంటర్‌లో నడిచి వెళుతున్న దంపతులను సిమెంట్ రాయితో కొట్టి చంపేస్తానని బెదిరించి అతని జేబులో ఉన్న ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్‌ను చోరీచేసి రైల్వేస్టేషన్‌మీదుగా పరారీ అయిన దొంగను సామర్లకోట పోలీసులు చాకచక్యంగా కేవలం 12 గంటలలోనే అరెస్ట్ చేశారు. స్థానిక జగనన్న కాలనీకి చెందిన దాడి శివాజీ, అతని భార్య పద్మలు ద్రాక్షారామ ఆలయ దర్శననిమిత్తం వెళుతుండగా గాంధీ బొమ్మ సెంటర్‌కు చేరుకునే సరికి దొంగ తమను సిమెంట్ రాయితో కొట్టి చంపేస్తానని బెదిరించినట్లు బాధితులు తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగిన ఈ చోరీపై బాధిత వ్యక్తి నుంచి ఫిర్యాదు అందిన వెంటనే గాలింపుచర్యలు చేపట్టి సాయంత్రానికి దొంగను స్థానిక అయిదుతూముల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారించడంతో పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన మేకల రాము(బ్రామాచారి)గా గుర్తించి అరెస్ట్ చేశామని సీఐ కృష్ణభగవాన్ శనివారం రాత్రి విలేఖరులకు తెలిపారు. అతని వద్ద నుంచి చోరీ సొత్తును ఆయుధాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జడ్.బావారంలో మెడికల్ క్యాంప్

కరప, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జడ్.బావారంలో శనివారం స్వస్థనారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అధికారులు మహిళలకు ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. శిబిరంలో పలువురు మహిళలకు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యంగా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్యురాలు ఏంజెలినా, గైనకాలజిస్టు మేఘన, కూటమి నాయకులు కోటగిరి మహేంద్రబాబు, బండారు మురళి, బోగిరెడ్డి గంగాధర్, గుబ్బల భాస్కరరావు పాల్గొన్నారు.

అధికారులు లేని సమావేశాలు ఎందుకు

● గొల్లప్రోలు నగరపంచాయతీ కౌన్సిల్ సమావేశం

గొల్లప్రోలు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అధికారులు లేకుండా సమావేశాలు నిర్వహించడం వలన ప్రయోజనం ఏమిటని పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించారు. గొల్లప్రోలు నగరపంచాయతీ కౌన్సిల్ సమావేశం శనివారం ఛైర్‌పర్సన్ గంధ్రేటి మంగతాయారు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశం ప్రారంభంకాగానే టీడీపీ కౌన్సిలర్ గుళ్ల సుబ్బారావుమాట్లాడుతూ సమావేశానికి కమిషనర్, ఏఈ హాజరుకాకపోవడాన్ని ప్రస్తావించారు. వారు లేకుండా సమావేశాలు నిర్వహించడం తగదన్నారు. కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు అంశాన్ని ఆమోదించారు. అనంతరం అజెండాలోని మిగిలిన అంశాలను తదుపరి సమావేశానికి వాయిదా వేయాలని కౌన్సిలర్లు సూచించారు. దీంతో సదరు అంశాలను వాయిదావేసి సమావేశాన్ని ముగిస్తున్నట్లు ఛైర్‌పర్సన్ ప్రకటించారు.

ఎట్టకేలకు యూరియా వచ్చింది

● ప్రవేటు షాపుల వద్ద రైతుల బారులు

గొల్లప్రోలు/పిఠాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): యూరియా రాకలో చోటు చేసుకున్న జాప్యంతో రైతులుపడిన ఇబ్బందులు శనివారం పరిష్కారానికి నోచుకున్నాయి. జిల్లాకు వచ్చిన యూరియా స్టాకును మండలాలకు పంపారు. గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాలు, మండలాల్లోని ప్రవేటు దుకాణాలకు యూరి యా నిల్వలు రావడంతో షాపుల ముందుకు రైతులు బారులు తీరారు. యూరియా పంపిణీ కోసం రైతుల బయోమెట్రిక్‌ను తప్పనిసరి చేయడంతో పంపిణీ నెమ్మదిగా సాగింది. రైతులు తమవం తు వచ్చేవరకూ వేచి చూసి యూరియా బస్తాలను తీసుకువెళ్లారు. యూరియా విక్రయాలు సందర్భంగా ఎటువంటి ఇబ్బంది ఏర్పడకుండా చూసేందుకుగానూ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. గొల్లప్రోలు పట్టణంలో మూడు షాపులకు 65 మెట్రిక్ టన్నుల యూరియా రాగా పంపిణీ పూర్తి చేసినట్లు వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ తెలిపారు.

ఏఐడబ్ల్యూసీ సేవలు అభినందనీయం

● ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి(కరప), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్(ఏఐడబ్ల్యూసీ) చేస్తున్న సేవలు అభినందనీయమని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. పెదపూడి మండలం కరకుదురు వేణుగోపాలస్వామి కళ్యాణ మండపంలో శనివారం ఏఐడబ్ల్యూసీ, కాకినాడ మెయిన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సంస్థ కరకుదురు గ్రామాన్ని దత్తత తీసుకుని ఒక ఏడాది బాటు వైద్యఆరోగ్య కార్యక్రమాలు చేపట్టడానికి ముందుకు రావడం ముదావహమన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు వారు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సంస్థ ఇక్కడ నిర్వహించే కార్యకలాపాలకు ఎటువంటి అవసరమొచ్చినా ముందుంటామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. అనపర్తి, పిఠాపురం నియోజకవర్గాల జనసేన ఇన్‌చార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు, ఏఐడబ్ల్యూసీ కాకినాడ అసోసియేషన్ సభ్యులు, వరహి మహిళామండలి సభ్యులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కరకుదురు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు వినతులు

● పిఠాపురం, సామర్లకోటలో సచివాలయ సిబ్బంది వినూత్న నిరసన


పిఠాపురంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

పిఠాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో సచివాలయ సిబ్బంది వినూత్నరీతిలో నిరసన తెలిపారు. డోర్ టూ డోర్ సర్వే నిర్వహణను ఆపాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు, జూనియర్ అసిస్టెంట్ కేడర్‌కు అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ చేపట్టిన దశలవారీ ఆందోళనలో భాగంగా పిఠాపురం పట్టణంలోని మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అన్ని క్యాడర్లకు పదోన్నతి చానల్‌కల్పించాలని, సెలవు దినాల్లో పనిచేయించడం నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన

సామర్లకోట, (ఆంధ్రజ్యోతి):సామర్లకోట మండల పరిధిలో గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులు రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు శనివారం వేట్లపాలెంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం ఎదుట కొద్దిసేపు నినాదాలిస్తూ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల సీనియారిటీ లిస్ట్ విడుదలచేసి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అరియర్స్ కల్పించాలని, ప్రొఫెషనరీ పీరియడ్‌లో కన్సాలిడేటెడ్ పేమెంట్ కింద పనిచేసినందుకు రెండు సంవత్సరాల తొమ్మిది నెలలకు కూడా నోషనల్ ఇంక్రిమెంట్లు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు రావాల్సిన అంశాల న్నీ సత్వరం పరిష్కరించాలన్నారు. సచివాలయ ఉద్యోగులకు డోర్ టు డోర్ సేవలన్నీ పూర్తిగా తొలగించి ప్రభుత్వ విధులను పూర్తిస్థాయిలో ఒక నిర్దిష్ట జాబ్ చార్ట్ ప్రకారం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నిరసనలో వీరమల్ల లోవరాజు, ఖురేషీ, కిరణ్, అరుణ్, సత్యనారాయణ, గనిలక్ష్మి, దుర్గదేవి, దేవిదుర్గ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణలో బాధితులకు స్థలాలు పంపిణీ చేయాలి

● గ్రామసభలో బాధితుల మొర

సామర్లకోట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం వెంకటకృష్ణరాయపురం రోడ్డు వెంబడి రోడ్డు విస్తర ణలో భాగంగా ఇళ్లను తొలగించబడ్డ బాధితులకు ఇళ్లస్థలాలు సత్వరం పంపిణీ చేయాలని శనివారం సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డికి పలువురు బాధితులు విన్నవించారు. కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ గ్రామ సభలో సుమారు 65 మంది లబ్ధిదారులు హాజరయ్యారు. రోడ్డు వెంబడి ఉన్న తమ విలువైన ఇళ్లను ప్రభుత్వం రోడ్డు విస్తరణకు స్వాధీనం చేసుకుని ఇప్పటికి 15 ఏళ్లు కావస్తుందని నేటికీ తమ స్థలాల సమస్య అలాగే ఉండిపోయిందన్నారు. ప్రభుత్వం సత్వరం స్పందించి తమకు అనుకూలంగా ఉన్న ప్రదేశంలోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డికి విన్నవించారు. నివేదికలను కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, కలెక్టర్‌లకు అందజేసి తదుపరి చర్యలు తీసుకుంటామని బాధితులందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు.

పశువధకు పాల్పడితే చర్యలు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అనధికారిక పశువధకు పాల్పడేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ హెచ్చరించారు. గొల్లప్రోలు మండలం చెందుర్తిలో ఆయన శనివారం రాత్రి పర్యటించారు. గ్రామస్థులతో సమావేశాలు నిర్వహించారు. పశువధ జరిగే ప్రాంతాల్లో సీసీ కెమేరాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడితే వాహనాలు సీజ్ చేయడంతోపాటు చట్టపరంగా చర్యలు చేపడతామని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారి సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంట గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తదితరులు ఉన్నారు.









ఏలేశ్వరంలో కౌన్సిల్ సాధారణ సమావేశం

ఏలేశ్వరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీలో కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. అజెండాలోని అంశాలను సీనియర్ అసిసెంట్ శేష వినిపించగా పలు అంశాలను కౌన్సిలర్లు అమోదించారు. పట్టణాభివృద్ధికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ నిధులు కేటాయించినట్లు కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు సుంకర హైమావతి, సామంతుల హైమావతి, యండగుండి నాగబాబు, వెంకటరమణ, పి.శ్రీను పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య రక్షణే ధ్యేయం



ప్రతిజ్ఞ చేస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ తదితరులు

శంఖవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని మార్కెట్ యార్డు చైర్మన్ బద్ది మణిరామారావు అన్నారు. శనివారం స్థానిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని వైద్య పరీక్షలను పర్యవేక్షించారు. వైద్యురాలు సౌమ్య పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బద్ది రామారావు, బద్ది రామకృష్ణ, జనసేన మండల ఉపాధ్యక్షుడు తలపంటి బుజ్జి పాల్గొన్నారు.

డిగ్రీ, జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలి

మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే సత్యప్రభ వినతి



ప్రత్తిపాడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా కోరారు. అమరావతిలో శనివారం మంత్రిని ఆమె కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మండలంలోని లంపకలోవలో ఇంటర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు.

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే: వెలగపూడి సచివాలయంలో శనివారం రాష్ట్ర శాసన సభ సంయుక్త కమిటీల ప్రారంభ సమావేశంలో వివిధ సంయుక్త కమిటీల సభ్యురాలిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైన గంగాభవానికి అభినందన

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): శరభవరం గ్రామానికి చెందిన నామాల గంగాభవాని స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. ఎంపికైన ఆమెకు ఎమ్మెల్యే నియామక పత్రం అందజేశారు. దీంతో శనివారం శరభవరంలో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించిన ఆమెను సర్పంచ్ అమరాది వెంకట్రావు ఆధ్వర్యంలో పలువురు స్థానికులు సన్మానించారు.

కాకినాడను సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి



ప్రత్తిపాడులోని ఎక్సైజ్ అధికారులతో సమావేశమైన రాహుల్‌దేవ్ శర్మ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాను సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ చెప్పారు. ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో శనివారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా సారా తయారు చేసే గ్రామాలపై చేపడుతున్న చర్యలు సమీక్షించారు. సమావేశంలో కాకినాడ ప్రొహిబిషన్ డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్ చైతన్య మురళి, అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుక, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి, ఎస్‌పీఎఫ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ దేవదత్తు, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.జయమౌనిక, జె.రామకృష్ణ, ఎక్సైజ్ సీఐ వి.శివప్రాద్, పిఠాపురం, తుని, పెద్దాపురం సర్కిల్ సీఐలు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో వైద్య శిబిరం

ఏలేశ్వరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన స్వస్థ నారీ స్వశక్త్ అభియాన్ కార్యక్రమంతో మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ విజయలక్ష్మీ నేతృత్వంలో వైద్య శిబిరం నిర్వహించి మహిళలకు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. కౌన్సిలర్లు అలమండ చలమయ్య, మూది నారాయణస్వామి, బొదిరెడ్డి గోపి, బదిరెడ్డి గోవింద్, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్‌వి రమణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకుమారి పాల్గొన్నారు. భద్రవరం గ్రామంలో మహిళలకు మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలను వైద్యులు రాంబాబు నిర్వహించారు. ఎంపీటీసీ కొప్పుల బాబ్జి, టీడీపీ నాయకుడు జిగటాపు సూరిబాబు పాల్గొన్నారు.

ఖైదీలపై ఎటువంటి వివక్షతకు తావులేదు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఖైదీలపై ఎటువంటి వివక్షతకు తావులేదని ప్రత్తిపాడు జడ్జి ఎల్.గోపీనాథ్ తెలిపారు. స్థానిక సబ్‌జైలులో శనివారం వివిధ శాఖల అధికారులతో కలిసి జడ్జి పరిశీలించారు. కారాగారంలో ఉండే ఖైదీలను కుల వివక్షత ఏమైనా జరుగుతుందని అని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయవచ్చని ఖైదీలకు సూచించారు. ఖైదీలకు ఇచ్చే ఆహారం, పాత్రలు ఆయన పరిశీలించారు. తహశీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎస్‌ఐ ఎస్.లక్ష్మీకాంతం, ఏవో జోకా అమృత, ఎంఈవో రాజబాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్‌డాక్టర్ సౌమ్య మైఖేల్, ఈడబ్ల్యూడీజేఈ విశ్వనాథరావు, న్యాయవాదులు బుగతా శివ, కుసుమంచి సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

మన్యంవారిపాలెంలో బోనాల ఉత్సవం

జగ్గంపేట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రులు పురస్కరించుకుని జగ్గంపేట మండలం మన్యంవారిపాలెంలో వీధి రామాలయం వద్ద ఉన్న దుర్గాభవాని అమ్మవారికి 108మంది కన్యలు బోనాలు సమర్పించారు జగ్గంపేట శెట్టి బలిజిపేట శివారు పంట పొలాల్లో వెలసి ఉన్న శ్రీ ధన సత్తమ్మ అమ్మవారికి వందలాది మంది మహిళలు బోనాలు సమర్పించారు.

వేలంకలో నేత్ర వైద్య శిబిరం

కిర్లంపూడి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేలంక గ్రామంలో శనివారం తెలుగు యువత మండలాధ్యక్షుడు గండే కాశీ ఆధ్వర్యంలో కాకినాడ వాసన్ ఐకేర్ సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం న్విహించారు. 200మందికి కంటి పరీక్షలు చేసి 36 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఇంటి చెల్లారావు, బేతాళ నారాయణమూర్తి, బేతాళ వీరబాబు, గండే చెల్లారావు, గండే రామకృష్ణమూర్తి, గండే తాతీలు, వాసన్ ఐ కేర్ మేనేజర్ పి.స్వామివందనం, డాక్టర్ రమేష్, టెక్నీషియన్ సాగర్, పీఆర్‌వో నాగేంద్ర, స్థానిక ఆర్‌ఎం పీలు నైదాన రవి, రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

ఓఎస్ఇర్‌పై శిక్షణ

కోటనందూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానికమండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ, కార్యదర్శులకు ఓఎస్ఇర్‌పై రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరిగిందని ఎంపీడీవో వెంకటనారాయణ తెలిపారు. గ్రామ పంచాయతీల్లో ఓనుసోర్సు రెవెన్యూ పెంచేందుకు చర్యలు చేపడతున్నామని, దీనికి కనుగుణంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాస్, జైరామ్, ఎవిఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై బాధ్యతగా వ్యవహరించాలి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారుల పట్ల ఆరోగ్యం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి చెప్పారు. మండలంలోని ధర్మవరంలో సచివాలయం3 వద్ద పోతులూరు సచివాలయం వద్ద శనివారం మహిళా వైద్య శిబిరాలు, పౌష్టికాహార సదస్సులు నిర్వహించారు. వైద్యులు ఉషశ్రీ, రామ్‌కుమార్, గైనకాలజిస్ట్ వంశీప్రియ గర్భిణులు, మహిళలు చిన్నారులకు పౌష్టికాహార అందించే ప్రక్రియలో తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. కూటమి నాయకులు బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, బొల్లు వెంకటేశ్వరరావు, పంచాది వీరబాబు, వాకపల్లి సర్పంచ్ రొంగల నాగేశ్వరరావు, నాగులాపల్లి బాబ్జి,సీడీపీవో పద్మావతి, సూపర్‌వైజర్ చక్రవేణి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలి

కిర్లంపూడి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక సాధికారత సాధించేందుకు ఉద్యమ ఆధార్ ఎంతగానో దోహదపడుతుందని జిల్లా నాన్ పామ్ ఏపీఎం పి.విజయలక్ష్మి అన్నారు. కిర్లంపూడి మహిళా సమైక్య కార్యాలయంలో మహిళలకు ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియను ఏపీఎం శరకణం వేదకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. పి.విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. తీసుకున్న రుణాలను వాయిదాల రూపంలో బ్యాంకులకు తిరిగి సక్రమంగా చెల్లించాలన్నారు. జిల్లా రిసోర్సు పర్సన్, ఎస్.సత్య, సిసిలు బుల్లియ్య, లోవరాజు, వీవోఏలు పాల్గొన్నారు.

రేపు రంపచోడవరంలో జాబ్‌మేళా

వై.రామవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, భాను సప్లయిస్ ప్రాంగణంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి యువతీ, యువకుల కోసం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ట్రైనింగ్ సెంటర్ మేనేజర్ శ్రీకాంత్ భోగవిల్లి పిలుపునిచ్చారు. 300కు పైగా పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. టాటా ఎలక్ట్రానిక్స్, బ్లూ స్టార్, బ్లూ ఓషన్ మొదలగు ప్రముఖ కంపెనీలు హాజరవుతాయన్నారు. వివరాలకు 9494546366, 9701869742 నెంబర్లను సంప్రదించాలన్నారు.

విజయవాడకు కాలినడకన

దేవీపట్నం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇందుకూరు, ఇందుకూరుపేట తదితరగ్రామాల్లో ఈనెల22న భక్తులుభవానీ మాలలు ధరించారు. ఆయా ఆలయాల్లో ఏర్పాటు చేసుకున్న పీఠాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం విజయవాడకు కాలినడకన భవానీ భక్తులు పయనమయ్యారు. ఇందుకూరుపేట, ఇందుకూరు గ్రామాల్లోని ఆలయాల్లో నవరాత్రి వేడుకలు జరుగుతున్నాయి.

ముంపులోనే మిర్చి పంట

మురుమూరు వద్ద రహదారిపై వరదనీరు
భద్రాచలం- కూనవరం రోడ్‌లో రాకపోకలు బంద్



గన్నేరుకొయ్యపాడులో నీట మునిగిన మిర్చి చేను

ఎటపాక, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) గోదావరి వరద ఉధృతి శనివారం సాయంత్రం కాస్త తగ్గినా ఇంకా ముంపులోనే మిర్చి పంట ఉంది. శనివారం ఉదయం వరకు భద్రాచలం వద్ద 46.70 అడుగుల వరకు ఉన్న నీటిమట్టం సాయంత్రం నుంచి తగ్గుముఖం పట్టింది. సాయంత్రానికి 44.90అడుగులకు చేరుకుంది. నెల్లిపాక, గన్నవరం, గౌరిదేవిపేట, నందిగామ, మురుమూరు, పురుషోత్తపట్నం తదితర గ్రామాల్లో ఇటీవల సాగు చేసిన మిర్చి చేలు నీట మునిగాయి. శనివారం సాయంత్రం వరకు భద్రాచలం- కూనవరం రోడ్డులో మురుమూరు వద్ద ప్రధాన రహదారి ముంపునకు గురికావడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నెల్లిపాక- వీరాయిగూడెం గ్రామాల మధ్యలో రహదారిపైకి వరద నీరు చేరడంతో ఈరెండు గ్రామాలకు రెండు రోజులుగా రాకపోకలు నిలిచాయి.

వరదకు నీట మునిగిన పంట చేలు

కూనవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ఈసారి రైతును నిండా ముంచింది. గతంలో నాలుగుసార్లు గోదావరి వరద వచ్చినప్పటికీ అప్పుడు ఎటువంటి పంటలు లేకపోవడంతో ఎటువంటి ఇబ్బందులు లేవు. కానీ ఐదోసారి వచ్చిన వరద రైతులకు తీవ్ర నష్టం వాటిల్లేలా చేసింది. గోదావరి వరద కారణంగా మిర్చి, వరి చేలు నీట మునిగాయి. వరద ఎక్కువ కావడంతో భద్రాచలం-కూనవరం రాకపోకలు నిలిచిపోయాయి. పోలిపాక వద్ద ప్రధాన రహదారిపై వరదనీరు చేరింది.

వనం-మనంలో ఉద్యోగులు భాగస్వామ్యం కావాలి

రంపచోడవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో పనిచేస్తోన్న వివిధ శాఖల ఉద్యోగులు వనం-మనం కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్ అన్నారు. శనివారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో వనం-మనం కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు గిరిజన రైతులు ఆర్థికాభివృద్ధి చెందేలా నివేదికలు సమర్పించాలన్నారు. తల్లి పేరున ఒక మొక్క నాటేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఏపీఓ(జీ) డీఎన్వీ రమణ, డీఈవో వై.మల్లేశ్వరరావు, సబ్ డీఎఫ్‌వో అనూష, సుబ్బారెడ్డి, ఏపీడీలు శ్రీనివాస్ విశ్వనాథ్. ఎల్.రాంబాబు, డేగలయ్య, పీహెచ్‌వో దేవదానం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా విఘ్నేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

విఆర్‌పురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వీఆర్.పురం పెట్టవీధి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శనివారం శ్రీవిఘ్నేశ్వరస్వామివారి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. శ్రీరామగిరి దేవాలయం ప్రధానార్చకులు పురుషోత్తమాచార్యుల వేదమంత్రాల నడుమ, విగ్రహ దాత ఆచంటి శ్రీనివాస్ దంపతుల చేతుల మీదుగా 1.10 గంటలకు మేళతాళాలు, భక్తుల కోలాహలంతో వైభ వంగా స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. అనంతరం విగ్రహ దాత దంపతులు, జడ్పీటీసీ సభ్యుడు వాళ్ళ రంగారెడ్డి దంపతులు, శ్రీరామగిరి ఆలయ చైర్మన్ పెందుర్తి సుదర్శన్ దంపతులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు నాయకులు బొర్ర నరేష్‌కుమార్, బీరక సూర్య ప్రకాశరావు, బురక కన్నారావు, బాగుల అంజన్‌రావు పాల్గొన్నారు.

పందుల కోసం వేసిన ఉచ్చులో చిక్కుకున్న గేదె

మోతుగూడెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మోతుగడెం ఏపీ జెన్‌కో గ్యారేజ్ సమీపంలో వేటగాళ్లు అడవి పందుల కోసం వేసిన ఉచ్చులో పాడి గేదె చిక్కుకుంది. మోతుగూడేనికి చెందిన రేవతి తన గేదెలను శుక్రవారం ఏపీ జెన్‌కో గ్యారేజ్ సమీపంలోని అటవీ ప్రాంతానికి మేపడానికి తీసుకెళ్లింది. రూ.70వేలు విలువైన పాడి గేదె కనిపించలేదు. మరుసటి రోజుగ్యారేజ్ సమీపం అటవీప్రాం తంలో గాలించగా వేటగాళ్లు అమర్చిన ఇనుప తీగల ఉచ్చులో చిక్కుకుని కనిపించింది. ఉచ్చులో నుంచి బయటకు తీసి ఇంటికి తోలుకువెళ్లారు. గతంలో విద్యుత్ తీగలు తగులుకుని ఇద్దరిమృతి చెందారు.

రాజవొమ్మంగిలో వాహనాల తనిఖీలు

రాజవొమ్మంగి సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి):రాజవొమ్మంగిలో శనివారం రంపచోడవరం ఆర్టీవో రాజేష్ కుమార్ వాహనాల తనిఖీలు నిర్వహించారు. రికార్డులు సమగ్రంగాలేని వారికి, లైసెన్స్‌లు లేని వారికి జరిమానా విధించారు. ఆర్టీవో రాజేష్‌కుమార్ మాట్లాడుతూ రాజవొమ్మంగిలో భారీ వాహనాలు తిరగడంవల్ల రోడ్లు ఛిద్రమవుతున్నాయనే ఫిర్యాదుపై లారీ డ్రైవర్లను హెచ్చరించామన్నారు. శనివారం రాజవొమ్మంగి, జడ్డంగి గ్రామాల్లో తనిఖీల్లో రికార్డులు సక్రమంగాలేని 11వాహనాలకు రూ.76వేలు జరిమానా విధించామన్నారు.


ఆరోగ్యమే మహాభాగ్యం

కూనవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రతీ మహిళ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని కోతులగుట్ట ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.మహేష్‌బాబు అన్నారు. కోతుల గుట్ట ప్రభుత్వాస్పత్రిలో వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీపీ పాయం రంగమ్మ, టీడీపీ నాయకులు ఎడవల్లి భాస్కరరావు, గడ్డిపాటి ప్రసాద్, మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

































జగ్గంపేట

లలితా త్రిపురసుందరిదేవిగా దర్శనం



రౌతులపూడిలో లలితా త్రిపురసుందరి దేవిగా అమ్మవారు దర్శనం

రౌతులపూడి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడిలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆరో రోజు దుర్గాదేవి అమ్మవారు లలితా త్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని గాజులతో అలంకరించారు. సాయిబాబు గుడి వీధికి చెందిన మహిళలు నలభై రకాల పిండి వంటలతో సారెను సమర్పించారు.

అమ్మవారికి సారె



కోటనందూరులో అమ్మవారికి సారె తీసుకెళ్తున్న దృశ్యం

కోటనందూరు, (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రులను పురస్కరించుకుని కోటనందూరు సింహాద్రి కాలనీలో అమ్మవారికి మహిళలు సారెను ఊరేగింపుగా పట్టుకెళ్లి సమర్పించారు.



ఏలేశ్వరంలో కలశాలతో మహిళల ఊరేగింపు

వైభవంగా బోనాల ఊరేగింపు

ఏలేశ్వరం, (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో బోనాలు ఊరేగించారు. లింగవరం కాలనీ జేవీర్ ట్రస్ట్ చైర్మన్ జువ్విన వీర్రాజు వీర్రాఘవమ్మ దంపతుల నేతృత్వంలో 108 కలశాలతో బోనాలను పట్టణ వీధుల్లో మహిళలు సంప్రదాయంగా ఊరేగించారు. లలితా త్రిపురసుందరి దేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ప్రత్తిపాడులో బోనాల జాతర



ప్రతిపాడులో మహిళల బోనాల దృశ్యం

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో భవానీ భక్తుల ఆధ్వర్యంలో శనివారం మహిళల బోనాల జాతర ఘనంగా జరిగింది. శివాలయం వద్ద అభయ దుర్గ భవానీ భక్తుల సారథ్యంలో గ్రామంలోని వందలాది మంది మహిళా భక్తులు బోనాలు, కలశాలతో గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. రాచపల్లి అరుణాచలేశ్వర ఆలయంలోని అపీత కుచాంబ అమ్మవారిని లలితా త్రిపుర సుందరిదేవిగా అలంకరించారు.



నూతన చాంబర్‌లో పూజలు జరుపుతున్న తుని ఎమ్మెల్యే దివ్య

చాంబర్‌లో ఎమ్మెల్యే దివ్య పూజలు

తుని రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య అసెంబ్లీ భవనంలో ఆమెకు కేటాయించిన చాంబర్‌లో శనివారం ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆమె సీట్‌లో ఆసీనులు కాగా, పలువురు అధికారులు అభినందనలు తెలిపారు. పండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఆమె వెంట తుని నియోజకవర్గ టీడీపీ నాయకుడు యనమల రాజేష్ ఉన్నారు.

అన్న సమారాధన

తుని రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తుని ఎమ్మెల్యే యనమల దివ్య ఆధ్వర్యంలో హంసవరం శివారు పాదాలమ్మ ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు తరలి వచ్చి అన్న ప్రసాదంలో పాల్గొన్నారు.

శివాలయానికి స్టీలు బల్ల అందజేత

గండేపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నీలాద్రిరావుపేటలోనున్న రామలింగేశ్వరస్వామి దేవాలయానికి స్థానిక యువకులు గంధం నాగేంద్ర, కటారి వీరవెంకటరావు, నేదూరి మణికంఠ, ఆలయ కమిటీ సభ్యులు బొడ్డు సత్తిరాజు, డాక్టర్ నక్కా సత్తిబాబు, ఆలయ అర్చకులు రాజీవ్ ప్రసాద్ సమక్షంలో స్టీలు బల్ల బహూకరించారు. ఆలయ కమిటీ సభ్యులు యువకులను అభినందించారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ..తప్పిన ముప్పు

గండేపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాళ్లూరు గ్రామ శివారున శుక్రవారం తెల్లవారుజామున రాజమండ్రి నుంచి వైజాగ్ వైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న డ్రైనేజీపైకి దూసుకెళ్లింది. సుమారు పది మీటర్ల మేర వరకు వెళ్లి ఆగింది. దీంతో అక్కడున్న స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.